

సీఎం రేవంత్‌రెడ్డి చేయి పట్టుకొని విలపిస్తున్న సతీష్ తల్లి, భార్య

సతీష్ కుటుంబాన్ని ఆదుకుంటాం

- పార్టీ నాయకుడి దశదినకర్మలో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి
- ముఖ్యమంత్రి ఎదుట బోరున విలపించిన కుటుంబ సభ్యులు

మద్దూర్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన నారాయణపేట జిల్లా మద్దూర్ మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు కల్లప్ప సతీశ్ కుటుంబాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి శనివారం పరామర్శించారు. కుటుంబాన్ని పార్టీ పరంగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. మధ్యాహ్నం 12 గంటలకు హెలిక్యాప్టర్ ద్వారా మద్దూర్‌కు చేరుకున్న సీఎం పాత బస్టాండ్ వద్ద ఉన్న

- మిగతా 7వ పేజీలో..

శాంపిల్ దందా



- మహబూబ్‌నగర్ జిల్లాలో విచ్చలవిడిగా మందుల విక్రయం
- సగం ధరకు అమ్ముతున్న మెడికల్ రిప్రజెంటేటివ్స్
- వాటిని కొని సామాన్య రోగులకు అంటగడుతున్న ఆర్ఎంపీలు
- గ్రామీణ ప్రాంతాల్లోనే ఎక్కువ వ్యాపారం
- కార్యాలయానికే పరిమితమైన ఔషధ నియంత్రణ శాఖ అధికారులు

మహబూబ్‌నగర్ జిల్లాలో మెడికల్ మందుల శాంపిల్ దందా జోరుగా సాగుతోంది. వాటిని మెడికల్ రిప్రజెంటేటివ్స్ సగం ధరకే విక్రయిస్తుండగా, కొన్ని మెడికల్ దుకాణాలు, డాక్టర్లు, ఆర్ఎంపీలు ఆ మందులను రోగులకు అంటగడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇవి అధికంగా కనిపిస్తున్నాయి. వీటిపై పర్యవేక్షణ లేకపోవడం, ఔషధ నియంత్రణ శాఖ అధికారులు కార్యాలయానికే పరిమితం కావడంతో దందా విచ్చలవిడిగా కొనసాగుతోంది.

- మహబూబ్‌నగర్ వైద్యవిభాగం, ఆంధ్రజ్యోతి



మహబూబ్‌నగర్‌లోని ఓ ఆర్ఎంపీ క్లినిక్‌లో ఉన్న శాంపిల్ మందులు




మహబూబ్‌నగర్ జిల్లాలో శాంపిల్ మందుల విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఆయా కంపెనీలకు చెందిన మందులు ఫిజీషియన్ శాంపిల్స్ బయటి మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. కొన్ని మెడికల్ దుకాణాల్లో గోలీలు ఎక్కువగా అమ్ముతున్నారు. వాటిపై నాట్ ఫర్ సేల్, ఫిజీషియన్ షాంపిల్ అని దానిపై రాసి ఉంటుంది. కానీ అది కనిపించకుండా కట్ చేసి,

- మిగతా 7వ పేజీలో..

విధుల్లో కఠినంగా వ్యవహరిస్తా

- నాగర్‌కర్నూల్ డీపీవో రామ్మోహన్



నాగర్‌కర్నూల్ టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శులు సమయ పాలన పాటిస్తూ.. విధులను సక్రమంగా నిర్వహించపోతే చర్యలు తీసుకుంటాం. సర్పంచుల పదవీకాలం ముగిసిన తర్వాత ప్రభుత్వం నియమించిన ప్రత్యేక అధికారులు ఎప్పటికప్పుడు పంచాయతీలలో పాలన సజావుగా సాగేలా పర్యవేక్షిస్తున్నారని జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) రామ్మోహన్ ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

పంచాయతీలో ప్రత్యేక అధికారుల పాలన సక్రమంగా జరుగుతోందా?

ఈ ఏడాది జనవరిలో సర్పంచుల పదవీకాలం ముగిసిన వెంటనే ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలోని గ్రామ జనాభా ప్రకారం రెండు, మూడు గ్రామ పంచాయతీలకు ఒక్కో ప్రత్యేక అధికారిని నియమించాం. జిల్లాలో 461 గ్రామ పం చాయతీలకు 200 మంది ప్రత్యేక అధికారులను నియమించాం. ఇటీవలే కొంత మంది బదిలీ, ప్రమోషన్లతో వెళ్లగా ప్రస్తుతం 180 మంది ఉన్నారు. ఖాళీ అయినచోట నియమించేందుకు కలెక్టర్‌కు ప్రతిపాద నలు అందజేశాం.

ప్రభుత్వం నుంచి పంచాయతీలకు నిధుల వస్తున్నాయా?

జిల్లాలో గ్రామ పంచాయతీల నిర్వహణకు ఇటీవలే ప్రభుత్వం రూ.5.67 కోట్ల నిధులు విడుదల చేసింది. అందులో స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమానికి రూ.2.43 కోట్లు, సిబ్బంది వేతనాల కోసం 1.94 కోట్లు, ట్రాక్టర్ల ఈఎంఐ కోసం 179 గ్రామ పంచాయతీలకు రూ. 60.56 లక్షలు, కరెంటు బిల్లుల కోసం రూ.70 లక్షలు ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నెల మొదటి వారంలో అన్ని పంచాయతీల ఖాతాల్లో జమ చేశాం.

అన్ని గ్రామాల్లో తడి, పొడి చెత్త నిర్వహణ జరుగుతోందా?

జిల్లాలోని అన్ని పంచాయతీల్లో డంపింగ్ యార్డులు ఉన్నాయి. తడి, పొడి చెత్త నిర్వహణలో కాస్తా ఇబ్బందులు ఉన్నాయి. ప్రజలకు అవగాహన కల్పించినా పట్టించుకోవడం లేదు. ప్రజలు ఎవరికి వారు స్వచ్ఛందంగా ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకొని గ్రామ పంచాయతీకి సహకరించాలి.

హరితహారం మొక్కలను రక్షిస్తున్నారా?

ఉపాధిహామీ నిధులతో ప్రతీ గ్రామంలో పల్లె ప్రకృతి వనం ఏర్పాటు చేశాం. వాటిలో పెంచిన మొక్కలను గ్రామంలోని పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, పబ్లిక్ స్థలాల్లో నాటి సంరక్షిస్తున్నాం.

కార్యదర్శుల పనితీరు ఎలా ఉంది. గ్రామ సభలు నిర్వహిస్తున్నారా?

ప్రతీ రెండు నెలలకు ఒకసారి గ్రామ సభలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 2న గాంధీ జయంతి సందర్భంగా అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించాం. పారిశుధ్యం, తాగునీరు, వీధిలైట్లు, తదితర సమస్యలపై చర్చించి పరిష్కారానికి కృషి చేస్తున్నారు. ముఖ్యంగా పంచాయతీ కార్యదర్శులు సమయ పాలన పాటించి విధులకు సక్రమంగా హాజరయ్యేలా చూస్తున్నాం. పంచాయతీ కార్యదర్శులు రోజు వారి డీఎస్ఆర్ అటెండెన్స్ ఉదయం తొమ్మిది గంటలకు గ్రామ పంచాయతీలో విధులకు హాజరు కావాలి. పంచాయతీ కార్యదర్శుల పనితీరును ఎప్పటికప్పుడు ఎంపీవోలు, డీఎల్‌పీవోలు పర్యవేక్షిస్తున్నారు. నిబంధనలు అతిక్రమించిన పంచాయతీ కార్యదర్శులపై పంచాయతీరాజ్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటాం.

ఉడుకుడుకు రొట్టెలు

- ప్రజల జీవన విధానంలో మార్పులు
- రెండు పూటలా రొట్టెలే తినాలని తపిస్తున్న నలభై ఏళ్లు పైబడ్డవారు

7



జూరాల ప్రాజెక్టు వరదతో..

నిలిచిన లాంచి ప్రయాణం

- ప్రారంభానికి మరో వారం రోజుల సమయం

కొల్లాపూర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : సోమశిల కృష్ణా నది మీదుగా శ్రీశైలం వరకు సాగే లాంచి ప్రయాణం వరద ఉధృతి పెరగడంతో శనివారం జరగలేదు. జూరాల ప్రాజెక్టులో 11 గేట్లు ఎత్తడంతో వరద ఉధృతి పెరిగింది. దీంతో తెలంగాణ టూరిజం శాఖ లాంచి ప్రయాణం నిలిపి వేసినట్లు జిల్లా టూరిజం శాఖ అధికారి కల్వరాల నరసింహ పేర్కొన్నారు. శ్రీశైలం ప్రాజెక్టు మూడు గేట్లు తెరిచి కిందికి వరద నీటిని విడిచారు. దీంతో లాంచి ప్రయాణం వారం రోజుల్లో ప్రారంభం కానుందని ఆయన తెలిపారు.



సాంకేతిక సాగుతోనే లాభాలు

- రైతు సదస్సులో కలెక్టర్ బీఎం సంతోష్
- రైతులలో మార్పు కోసమే అవగాహన సదస్సు: ఎమ్మెల్యే



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, నాయకులు

గద్వాల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యవసాయంలో శాస్త్ర సాంకేతికవైపు రైతులు అడుగులు వేస్తేనే లాభాలను పొందవచ్చని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. శనివారం మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన రైతు సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలో 80శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారని, నాలుగు లక్షల ఎకరాల సాగు భూమిలో ఎక్కువగా వరి, పత్తిని సాగు చేస్తున్నారని అన్నారు. వరికి ఎక్కువ నీరు అవసరమని, తక్కువ నీటితో అధిక దిగుబడులు వచ్చే పంటలవైపు రైతులు అడుగులు వేయాలని కోరారు. పప్పుదినుసులు, ఆయిల్ పామ్, డ్రాగన్ ఫ్రూట్, బత్తాయి వంటి వాటిని సాగు చేయాలన్నారు. అగ్రికల్చర్‌తో పాటు ఆర్టికల్చర్ స్టాల్స్ ఆకట్టుకున్నాయని అన్నారు. ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడు తూ రైతుల్లో అవగాహన పెంచేందుకే ఈ సదస్సును ఏర్పాటు చేశామని వివరించారు. ఈ స్టాల్స్ వలన ప్రతీ రైతు అందులోని విషయాలు తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, ఆర్డీవో రాంచందర్‌నాయక్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ హనుమంతు, వ్యవసాయశాఖ అధికారి సక్రియానాయక్, ఆర్టికల్చర్ అధికారి అక్బర్, నాయకులు ఉన్నారు.

క్లిక్.. క్లిక్..



అమ్మ చెరువు అలుగు మీదుగా ప్రమాదకరంగా వెళ్తున్న ద్విచక్ర వాహనదారులు

తస్మాత్ జాగ్రత్త!

వనపర్తి పట్టణంలోని రాజనగరం సమీపంలో ఉన్న అమ్మ చెరువు అలుగుపారుతోంది. రాజనగరం వాసులు ద్విచక్ర వాహనాలతో అలుగు మీదుగానే ప్రయాణం చేస్తున్నారు. ఎప్పుడూ నీరు ప్రవహిస్తుండటంతో అలుగుపై నాచు పేరుకోవడం వల్ల జారి కిందపడి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. తస్మాత్ జాగ్రత్త!

- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వనపర్తి



ఎన్ఆర్‌సీలో పూర్తి స్థాయి

ఫలితాలు సాధించాలి

- జీజీహెచ్, ఎంసీహెచ్‌లను తనిఖీ చేసిన కలెక్టర్



రోగుల బంధువులతో మాట్లాడుతున్న కలెక్టర్

వనపర్తి టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఎన్ఆర్‌సీలో పూర్తిస్థాయి ఫలితాలు సాధించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శనివారం మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌తో కలిసి తనిఖీ చేశారు. జిల్లాలోని స్యామ్, మ్యామ్ పథకానికి సంబంధించిన పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. వయసుకు తగ్గ ఎత్తు, బరువు లేకుండా ఉండటానికి గల కారణాలు తెలుసుకుని చికిత్సతో పాటు అక్కడే పౌష్టికాహారం అందించేందుకు ఏర్పాటు చేసిన ఎన్ఆర్‌సీ కేంద్రంలో పూర్తిస్థాయి ఫలితాలు సాధించాలని వైద్యులకు సూచించారు. జిల్లాలో దాదాపు 200 వరకు స్యామ్, మ్యామ్ పిల్లలు ఉన్నట్లు స్త్రీ శిశు సంక్షేమ శాఖ ద్వారా గుర్తించడం జరిగిందని, వారిని ఎన్ఆర్‌సీ కేంద్రానికి తీసుకురావాలని సూచించారు. పిల్లల ఆరోగ్య సంరక్షణపై తల్లి దండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి పంపించాలని సూచించారు. అనంతరం పక్కనే కొత్తగా నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ యూనిట్ భవనాన్ని పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం, సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జయచంద్ర మోహన్, ప్రోగ్రాం ఆఫీసర్లు సాయినాథ్ రెడ్డి, పరిమిళ తదితరులు ఉన్నారు.

పోడు భూముల రగడ

- ఫారెస్టు అధికారులు, గిరిజనుల మధ్య వాగ్వాదం, తోపులాట
- మా భూములు మాకు ఇవ్వాలని గిరిజన మహిళ ఆత్మహత్యాయత్నం
- ఫారెస్టు భూముల జోలికి వస్తే కఠిన చర్యలు : ఫారెస్టు రేంజర్



తమ భూముల్లో మొక్కలు నాటొద్దని అటవీ శాఖ అధికారుల కాళ్లపై పడి వేడుకుంటున్న మహిళ



తాము వ్యవసాయం చేసే భూముల్లో మొక్కలు నాటొద్దని రోదిస్తున్న గిరిజన మహిళ

కొల్లాపూర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : గడిచిన కొన్ని రోజుల నుంచి అటవీశాఖ ఆధ్వర్యంలో పోడు, అటవీ భూముల్లో ఫారెస్టు అధికారులు మొక్కలు నాటే కార్యక్రమాన్ని విధిగా చేపట్టారు. అందులో భాగంగా శనివారం నాగర్‌కర్నూలు జిల్లా కొల్లాపూర్ మండలం ఎర్రగట్టు బొల్లారం సమీపంలోని పోడు భూముల్లో మొక్కలు నాటేందుకు వెళ్లిన అటవీ అధికారులకు చేదు అనుభవం ఎదురైంది. తాము సాగు చేసుకుంటున్న భూముల్లో మొక్కలు నాటొద్దని, తాము సాగుచేసిన పంటలను నాశనం చేయొద్దని గిరిజన రైతులు అటవీ అధికారులతో వాగ్వాదానికి దిగారు. దీంతో అటవీ అధికారులు, గిరిజనుల మధ్య తోపులాట జరిగింది. అయినా పోడు భూముల్లో మొక్కలు తప్పక నాటుతామని అటవీ అధికారులు తేల్చి చెప్పారు. దీంతో మనస్తాపానికి గురైన గిరిజన మహిళ రోదిస్తూ అటవీ అధికారుల కాళ్లు మొక్కినా చలించకపోవడంతో పక్కనే ఉన్న చెట్టుపైకి ఎక్కి ఉరి వేసుకొని ఆత్మహత్యాయత్నం చేసింది. పక్కనే ఉన్న ఆ గిరిజన మహిళ బంధువులు తేరుకొని ఆమెను రక్షించారు. 20 సంవత్సరాల నుంచి పోడు భూములను సాగు చేసుకొని జీవిస్తున్నామని, అటవీ అధికారులు ఇప్పుడు వచ్చి తమ పంటలను నాశనం చేసి తమ భూముల్లో మొక్కలు నాటడం తగదని గిరిజనులు ఆవేదన వ్యక్తంచేశారు. ఇదిలా ఉండగా కేవలం మూడు నెలల నుంచి ఫారెస్టు భూములను గిరిజనులు ఆక్రమిస్తున్నారని, అటవీ శాఖ ఆధ్వర్యంలో వాటిని అడ్డుకునేందుకు భూముల్లో మొక్కలు నాటుతున్నామని కొల్లాపూర్ ఫారెస్టు రేంజర్ చంద్రశేఖర్ చెప్పారు. అటవీ శాఖ భూముల జోలికివస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

దేశవాళీ విత్తనాల

పరిరక్షణే లక్ష్యం

- సేంద్రియ వ్యవసాయంతో సాగు
- ఆరోగ్యంగా ఉండేందుకు అరుదైన రకాలు

6

ఎట్టకేలకు అడుగు ముందుకు

- డిజిటల్ సర్వేకు కదిలిన వ్యవసాయ విస్తరణ అధికారులు

7

రసవత్తరంగా ఉమ్మడి జిల్లా క్రికెట్ టోర్నీ

- ఫైనల్‌కు చేరిన మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్


వనపర్తి జట్టుతో సురేష్‌కుమార్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా అండర్-23 క్రికెట్ టోర్నీ రసవత్తరంగా కొనసాగుతున్నది. శనివారం బోయపల్లి సమీపంలో ఎండీసీఏ మైదానంలో నిర్వహించిన మొదటి మ్యాచ్‌లో మహబూబ్‌నగర్ జట్టు కొడంగల్‌పై 60 పరుగుల తేడాతో గెలిచి ఫైనల్‌కు చేరింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన మహబూబ్‌నగర్ జట్టు 25 ఓవర్లలో 1 వికెట్ నష్టానికి 174 పరుగులు చేసింది. జట్టులో అక్షయ్ 44 పరుగులు చేసి ఔట్‌కాగా, అబ్దుల్ రాఫె 70 బంతుల్లో 13 ఫోర్లతో సెంచరీ(102) చేశారు. అంజి 22 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కొడంగల్ జట్టు నిర్ణీత 25 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 114 పరుగులు చేసి ఓటమి పాలైంది.

51 పరుగుల తేడాతో వనపర్తి గెలుపు


సెంచరీ చేసిన అబ్దుల్‌రాఫె

రెండో మ్యాచ్‌లో వనపర్తి జట్టు గద్వాలపై 51 పరుగుల తేడాతో గెలిచింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన వనపర్తి జట్టు నిర్ణీత 25 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 138 పరుగులు చేసింది. జట్టులో శ్రీకాంత్ అర్ధసెంచరీ(68) పరుగులు చేయగా, పవన్ 15 పరుగులు చేశాడు. గద్వాల బౌలర్లలో ఇర్ఫాన్ 3 వికెట్లు, కె.శ్రీకాంత్ 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన గద్వాల జట్టు 17 ఓవర్లలో 87 పరుగులకు కుప్పకూలింది. వనపర్తి జట్టు బౌలర్లలో ప్రణీత్‌రెడ్డి, ప్రతీష్, చత్రపతి మూడేసి వికెట్లు తీసి జట్టు విజయానికి కృషి చేశారు. మహబూబ్‌నగర్ జట్టు 4 పాయింట్లు, నాగర్‌కర్నూల్ జట్టు 3 పాయింట్లతో ఫైనల్‌కు చేరాయి.

క్రీడల్లో గెలుపు, ఓటములు సహజం


క్రీడల్లో గెలుపు, ఓటములు సమానంగా తీసుకోవాలని జిల్లా క్రికెట్ సంఘం ఉపాధ్యక్షుడు సురేసకుమార్ అన్నారు. వనపర్తి, గద్వాల జట్ల మ్యాచ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో నిర్వహిస్తున్న టోర్నీల్లో క్రీడాకారులు చక్కగా ఆడుతున్నారని, భవిష్యత్తులో ఇలాగే కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో కోచ్ అబ్దుల్లా పాల్గొన్నారు.

- ఎండీసీఏ ఉపాధ్యక్షుడు సురేష్‌కుమార్

దేశవాళి విత్తనాల పరిరక్షణే లక్ష్యం


పేటలో సాగు చేసిన నల్ల వడ్ల పంట

- » సేంద్రియ వ్యవసాయంతో పంటలు పండిస్తూ..
- » ఆరోగ్యంగా ఉండేందుకు అరుదైన రకాలు ఏన్నెన్నో..
- » ఏనిమిదేళ్లుగా సేంద్రియ సాగులో నారాయణపేటకు చెందిన భీంచందర్‌గౌడ్
- » ఉద్యోగ విరమణ తర్వాత వ్యవసాయంపై దృష్టి
- » తండ్రి ప్రోత్సాహం, సుభాష్ పాలేకర్ స్ఫూర్తి



సాధారణంగా అందరికీ తెలిసిన వరి రకాలు సోనామసూరి, హంస. రైతులకు మాత్రం ఆర్ అండ్ ఆర్ (తెలంగాణ సోనా) 1010 రకం (దొడ్డు బియ్యం) రకాలు కూడా తెలుసు. అయితే అతి తక్కువ మందికి తెలిసిన అరుదైన దేశవాళి వరి వంగడాలను సాగు చేస్తూ ప్రత్యేకతను చాటుకుంటున్నారు రైతు భీంచందర్ గౌడ్. ఆయన సాగు చేస్తున్న వరి రకాలు, వాటి ప్రత్యేకతలపై 'ఆంధ్రజ్యోతి' ఆయనతో ముచ్చటించింది. ఆ వివరాలు మీ కోసం... - నారాయణపేట, ఆంధ్రజ్యోతి

దేశవాళి విత్తనాల పరిరక్షణే లక్ష్యంగా, సేంద్రియ ఎరువులను మాత్రమే వినియోగిస్తూ అరుదైన వరి వంగడాలను సాగు చేస్తున్నారు నారాయణపేటకు చెందిన భీంచందర్ గౌడ్. వ్యవసాయ కుటుంబంలో పుట్టి పెరిగిన ఆయన బీఎస్ఎన్ఎల్‌లో పని చేసి ఉద్యోగ విరమణ చేశారు. ఆ తర్వాత వ్యవసాయమే పంచప్రాణాలుగా భావించే తండ్రి శ్రీధర్‌గౌడ్ ప్రోత్సాహం, పద్మశ్రీ పురస్కార గ్రహీత సుభాష్ పాలేకర్ స్ఫూర్తితో పంటల సాగుపై దృష్టి సారించారు. 2016 నుంచి 10 ఎకరాల్లో పంటలను సాగు చేస్తున్న ఆయన రసాయనిక ఎరువులు, పురుగు మందులను వినియోగించకుండా, సేంద్రియ ఎరువులను మాత్రమే వినియోగిస్తున్నారు. ప్రధానంగా ఎన్నో రకాల దేశవాళి వరి వంగడాలను సాగు చేస్తున్నారు. తాను సాగు చేస్తున్న వరి రకాలు, వాటి ప్రత్యేకతలను ఆయన 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. వివరాలు ఆయన మాటల్లోనే...

సేంద్రియ సాగుతో ప్రయోజనం



సేంద్రియ పద్ధతిలో పంటలు సాగు చేస్తున్నాను. రసాయనిక ఎరువులకు బదులుగా, పశువుల ఎరువులు, ఘన, ద్రవ జీవామృతం తయారు చేసుకొని సాగుకు వినియోగిస్తున్నాం. గోమూత్రం, పెండ, బెల్లం, పప్పుల పిండి మిశ్రమాన్ని ఎనిమిది రోజులు నిల్వ ఉంచుతాం. ఎకరాకు ఆరు లీటర్ల చొప్పున నీటిలో కలిపి పిచికారి చేస్తాం. గోకృపామృతం తయారీకి మజ్జిగ, బెల్లం కలిపి 45 రోజులకోసారి రిసైక్లింగ్ చేసి వెదజల్లుతాం. దీని వల్ల నేల సారవంతమై అధిక దిగుబడులు లభిస్తాయి.

- భీంచందర్‌గౌడ్, రైతు, నారాయణపేట

మపిళ్లై సాంబర్ (వరుడి బియ్యం)

ఇది తమిళనాడుకు చెందిన సంప్రదాయ వరి రకం. మపిళ్లై అంటే తమిళంలో వరుడు అని అర్థం. పెళ్లయిన తర్వాత నూతన వధూవరులకు ఈ బియ్యంతో వండిన అన్నాన్ని తినిపించడం అక్కడి ఆచారం. దీని వల్ల సంతానం కలుగుతుందని వారి విశ్వాసం. ఈ రకం వరి ఏడు నెలల కాల పరిమితిలో, ఆరు ఫీట్ల ఎత్తు పెరిగి కోతకు సిద్ధం అవుతుంది. దీనికి సాగు కొంత సంక్లిష్టంగా ఉంటుంది. 2022లో రెండు ఏకరాల్లో ఈ పంట సాగు చేశాను.

నవారా (ఎర్రబియ్యం):

ఈ రకం బియ్యంతో చేసిన అన్నం తింటే షుగర్ నియంత్రణలో ఉంటుందని, నరాలకు బలం చేకూరుతుందని, కండారాల నొప్పులు తగ్గుతాయని చెప్తారు.

మూడున్నర నెలల కాలం పంట, దొడ్డు బియ్యం కాబట్టి రాత్రి నానబెట్టి మరుసటి రోజు వండుకోవాల్సి ఉంటుంది.

కేరళ రాష్ట్రంలోని పంచకర్మ కేంద్రాల్లో పక్షవాతం వచ్చిన వారికి ఈ బియ్యం పిండితో తయారైన పేస్టుతో మర్దన చేస్తారు.

కాట బట్టి(బ్లాక్ రైస్):

ఈ బియ్యంతో చేసిన పాయసం, మిఠాయిలు రుచికరంగా ఉంటాయి. అన్నం నల్లగా ఉంటుంది. ఈ బియ్యంతో చేసిన అన్నం తింటే పొట్ట తగ్గుతుందని, క్యాన్సర్ నిరోధకంగా కూడా పని చేస్తుందని చెప్తారు. పంట కాలం 150 రోజులు కాగా, దేశంలోని అన్ని ప్రాంతాల్లో సాగుకు అనుకూలం. ప్రకృతి వ్యవసాయం చేసేవారు ఈ రకం పంట సాగు చేస్తారు.

మైసూర్ మల్లికా:

పంట కాలం నాలుగు నెలలు. కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో అధికంగా పండిస్తారు. 2017 నుంచి ప్రతీ సంవత్సరం నాలుగు ఏకరాల్లో సాగు చేస్తున్నాను. ఈ బియ్యంతో వండిన అన్నం తింటే చిన్నపిల్లల్లో మేధాశక్తి పెరుగుతుందని పెద్దలు చెప్తుంటారు.

కుజు పటాలియా : సన్నబియ్యం రకానికి చెందిన ఈ పంటను తమిళనాడు, ఒడిశా రాష్ట్రాల్లో పండిస్తారు. ముఖ్యంగా మయో వృద్ధుల్లో జీర్ణ ప్రక్రియను పెంపొందించేందుకు దోహదపడుతుంది.

బహురూపి బియ్యం : పంట కాలం నాలుగు నెలలు. ఇది కూడా షుగర్‌ను నియంత్రణలో ఉంచుకునేందుకు సహ కరిస్తుంది. పంటకాలం 110 రోజులు కాగా, ఒడిషా రాష్ట్రంలో ఎక్కువగా సాగు చేస్తారు.

చిట్టి ముత్యాలు : ఈ బియ్యం సువాసన కలిగి ఉంటుంది. బిర్యానీ తయారీకి ఇది పేరు గాంచింది. ఇది 120 రోజుల పంట. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో సాగు చేస్తారు.

కులాకర్:

ఇది కూడా ఒడిశాలో ఎక్కువ మంది రైతులు పండించే ఎర్ర బియ్యం. పంట కాలం మూడు నెలలు. ముఖ్యంగా గర్భిణుల ఆరోగ్య పరిరక్షణకు ఉపకరిస్తుంది. పోషకాలు లభించి బిడ్డకు తల్లి పాలు సమృద్ధిగా అందుతాయని చెప్తుంటారు.

శ్రీకాంత్‌గౌడ్‌కు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్

» వైద్య పరీక్షల అనంతరం అచ్చంపేట కోర్టులో హాజరుపరిచిన పోలీసులు


జిల్లా జైలుకు శ్రీకాంత్‌గౌడ్‌ను తరలిస్తున్న పోలీసులు

మహబూబ్‌నగర్/అచ్చంపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ సోదరుడు శ్రీకాంత్‌గౌడ్‌కు న్యాయస్థానం 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధించింది. 523 సర్వేనెంబర్‌లో అధికారుల ఫోర్జరీ సంతకాలతో బోగస్ పట్టాలు సృష్టించారన్న కేసులో ఏ4 నిందితుడిగా ఉన్న శ్రీకాంత్‌గౌడ్ శుక్రవారం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయిన సంగతి తెలిసిందే. శనివారం ఉదయం 9:30 గంటల సమయంలో ఆయనను పోలీసులు మహబూబ్‌నగర్ జనరల్ ఆసుపత్రికి తీసుకెళ్లి, వైద్య పరీక్షల అనంతరం రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అయితే శ్రీకాంత్ గౌడ్ ఉన్న పోలీస్‌స్టేషన్ వద్దకు ఉదయం నుంచే బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్దఎత్తున చేరుకున్నారు. మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ కూడా స్టేషన్ వద్దకు వచ్చారు అనంతరం పోలీసులు ఆయనను ప్రత్యేక వాహనంలో పోలీస్ బందోబస్తు మధ్య అక్కడి నుంచి అచ్చంపేట కోర్టుకు తరలించారు. కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధించారు. అనంతరం అక్కడి నుంచి పోలీసులు నేరుగా మహబూబ్‌నగర్ జిల్లా జైలుకు తరలించారు. సాయంత్రం 4:40 గంటల సమయంలో పోలీసులు శ్రీకాంత్‌గౌడ్‌ను జిల్లా జైలుకు తీసుకురాగా అప్పటికే పార్టీశ్రేణులు జైలువద్దకు తరలివచ్చారు. అప్పటికే జైలు అధికారులు అక్కడ అన్ని ఏర్పాట్లు చేసుకుని, ఆయనను లోపలికి పంపారు. తర్వాత పార్టీశ్రేణులు అక్కడి నుంచి వెళ్లి పోయాయి.

ఫేక్ పట్టాలతో అక్రమాలపై ఫిర్యాదులు

క్రిష్టియన్‌పల్లి 523 సర్వే నెంబర్‌లో ఫేక్‌పట్టాలు సృష్టించి ప్లాట్‌లు విక్రయించారన్న ఫిర్యాదులతో విచారణ చేశామని డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు.

విచారణలో అధికారుల సంతకాలు ఫోర్జరీ చేసి ప్లాట్లు విక్రయించారని, ఇందులో నలుగురు వ్యక్తుల ప్రమేయం ఉన్నట్లు తేలడంతో ఇప్పటికే ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ఏ4గా ఉన్న శ్రీకాంత్ గౌడ్ తప్పించుకుని తిరుగుతూ ముందస్తు బెయిల్ కోసం హైకోర్టు, సుప్రీం కోర్టులను ఆశ్రయించినా బెయిల్ రాకపోవడంతో శుక్రవారం లొంగిపోయారన్నారు.

ఎస్పీని కలిసిన బీఆర్ఎస్ నాయకులు

మాజీ మంత్రులు వి.శ్రీనివాస్‌గౌడ్, డాక్టర్ సి.లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, దేవరకద్ర, షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్ రెడ్డి, అంజయ్యయాదవ్ జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ జానకిని కలిశారు.

బీఆర్ఎస్ శ్రేణులపై అధికార పార్టీ కక్షపూరితంగా వ్యవహరిస్తున్నదని, కావాలనే కేసుల్లో శ్రీకాంత్‌గౌడ్‌ను ఇరికించారని చెప్పారు.

ముగిసిన సాంస్కృతిక పోటీలు

ఆత్మకూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ఉత్పత్తి కేంద్రంలో మూడు రోజులుగా కొనసాగు తున్న రాష్ట్రస్థాయి సాంస్కృతిక పోటీలు శనివారం ముగిశాయి. రాష్ట్రంలోని ఆయా జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల నుంచి 80 మంది ఉద్యోగులు పాల్గొన్నారు. క్యారమ్స్ విభాగంలో మొదటి బహుమతి ఎస్‌ఐ బీహెచ్ ఈఎస్, జూరాల జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం రెండవ, కేటీపీఎస్ ఉత్పత్తి కేంద్రం మూడో బహుమతులను అందజేశారు.

అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల పోటీల్లో ఉత్తమ నటుడుగా హుస్సేనప్ప (ఎస్ఎల్ బీఈఎస్), ఫోక్ సాంగ్ విభాగంలో మసూద్ ప్రథమ స్థానం, రమణాచారి ద్వితీయ స్థానం, ఎస్‌కే భాష తృతీయ స్థానాలు కైవసం చేసుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమంలో లోయర్ జూరాల సివిల్ ఎస్ఈ సురేష్ దుర్యోధన పాత్రలో నటించి ఏకపాత్రాభినయం చేసి అందరిని అలరించారు.


బహుమతులు ప్రదానం చేస్తున్న ఎస్ఈ సూరిబాబు

కురుమూర్తి బ్రహ్మోత్సవాలకు సీఎంను ఆహ్వానిస్తా..

- ఆలయ పాలకవర ప్రమాణ స్వీకారోత్సవంలో ఎమ్మెల్యే జీఎమ్మార్


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

చిన్నచింతకుంట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కురుమూర్తి బ్రహ్మోత్సవాలకు సీఎం రేవంత్‌రెడ్డిని ప్రత్యేకంగా ఆహ్వానిస్తానని దేవరకద్ర ఎమ్మెల్యే జీ మధుసూదన్‌రెడ్డి స్పష్టం చేశారు. శనివారం మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలంలోని అమ్మాపూర్ గ్రామ సమీపంలో కురుమూర్తి స్వామి ఆలయ నూతన పాలకవర్గ పదవీ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన హాజరయ్యారు. దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సీతాదయాకర్‌రెడ్డి తనయుడు సిద్దార్థరెడ్డి, నాయకులు జగదభిరాంరెడ్డి, దేవాదాయ శాఖ ఆలయ ఈవో మదనేశ్వర్‌రెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఇన్‌స్పెక్టర్ వాసు సమక్షంలో ప్రమాణ స్వీకారం చేయించారు. చైర్మన్‌గా గోవర్ధన్‌రెడ్డి, సభ్యులు భారతి, నెల్లి ప్రభాకర్, అల్లెదులధర్ రెడ్డి, బి.శేఖర్, భాస్క రాచారి, పి.నాగరాజు, రాఘవేంద్ర, కమలా కర్, గౌనిరాము, వన్నాడ గోపాల్, చక్రవర్ధన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, రాములు, ఎక్స్ అఫిషియో సభ్యుడు వెంకటయ్య ప్రమాణం చేశారు.

అనంతరం జాతర మైదానంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కురుమూర్తి గుట్టమీదకు ఘాట్ రోడ్డు మంజూరు కోసం సీఎంతో పాటు, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. రెండు రోజుల్లో నిధులు మంజూరయ్యే అవకాశం ఉందని, వచ్చే బ్రహ్మోత్సవాలలోపు ఘాట్ రోడ్డు భక్తులకు అందుబాటులోకి వచ్చే విధంగా చూస్తానన్నారు. అలాగే కల్యాణ మండపం కోసం ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. శాశ్వతంగా తాగునీరు, టాయిలెట్స్ వసతులు వచ్చే ఏడాదిలోగా పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకుం టున్నట్లు తెలిపారు.

వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

నెలికొండి గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. మండల పరిషత్ కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ఆలయ ఈవో మదనేశ్వర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ వాసు, ఆలయ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి, నాయకులు అరవింద్‌కుమార్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, ఉమా మహేశ్వర్‌రెడ్డి, నెల్లికొండి మాజీ సర్పంచ్ వెంకటేష్, యువజన నాయకులు ఎస్.వెంకటేష్, ప్రదీప్ రెడ్డి, తెలుగు వెంకటేష్, కథలప్ప, మైమూద్, అశోక్ ఉన్నారు.

పలువురు పుర కమిషనర్‌ల బదిలీ

మహబూబ్‌నగర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పాలమూరు జిల్లాలోని పలు పురపాలికలకు సంబంధించిన కమిషనర్‌లు బదిలీ అయ్యారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని భూత్పూర్, జడ్చర్ల కమిషనర్‌లు బదిలీ కాగా, పాలమూరు పురపాలిక కమిషనర్ బదిలీ జాబితాలో ఉండగా చివరి క్షణంలో ఆయన బదిలీ నిలిచిపోయింది. జడ్చర్ల మునిసిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఎస్ రాజేశ్ వడ్డేపల్లి మునిసిపాలిటీకి బదిలీకాగా, వడ్డేపల్లి మునిసిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి జడ్చర్ల కమిషనర్‌గా నియమితులయ్యారు. భూత్పూర్ మునిసిపల్ కమిషనర్ సురేందర్‌రెడ్డి గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్‌కు బదిలీ అయ్యారు. అలంపూర్ కమిషనర్ సరస్వతి బండంగ్‌పేట కార్పొరేషన్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు.

సమన్వయంతో పనిచేయాలి

» జలశక్తి అభియాన్ కేంద్ర గ్రామీణాభివృద్ధి సంస్థ జాయింట్ సెక్రటరీ అమిత్‌శుక్లా


సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ సెక్రటరీ అమిత్‌శుక్లా

గద్వాల న్యూటౌన్/కేటిదొడ్డి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నీటి వనరుల పునరుద్ధరణ, పరిరక్షణకై అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని జలశక్తి అభియాన్ కేంద్ర గ్రామీణాభివృద్ధి సంస్థ జాయింట్ సెక్రటరీ అమిత్ శుక్లా అన్నారు. శనివారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జల శక్తి అభియాన్ క్యాచ్‌ది రెయిన్-2024 నారీ శక్తి సే జలశక్తి అనే ఇతివృత్తంపై నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నీటి సంరక్షణ, నిర్వహణలో మహిళలు కీలక భూమిక నిర్వహించాలని, నీటి సంరక్షణ, ప్రాముఖ్యత, భూగర్భ జలాలు, నాణ్యమైన నీటి సరఫరా, స్వచ్ఛమైన నీటి వనరుల ప్రాముఖ్యతను సోషల్ మీడియా ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సంబంధిత శాఖలన్ని సమన్వయంతో పనిచేసి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో చేపట్టిన వాటర్ బాడిస్ పనులు అన్నింటిని జియోటాకింగ్ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రౌండ్‌వాటర్, ఇరిగేషన్, డీఆర్‌డీవో శాఖలు జిల్లాలో చేపట్టిన పనులపై పీపీటీ ప్రజెంటేషన్ నిర్వహించారు. అంతకుముందు కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌తో కలిసి ఆయన మొక్కలు నాటారు. వివిధ శాఖలు ఏర్పాటు చేసిన చాయా చిత్ర ప్రదర్శనను ఆయన తిలకించారు. ఈ సమావేశంలో జలశక్తి అభియాన్ టెక్నికల్ అధికారి మధుసూదన్, డీఆర్‌డీవో నర్సింగరావు, జిల్లా ఫారెస్ట్ అధికారి నవీన్‌రెడ్డి, భూగర్భ జల శాఖ డిప్యూటీ డైరెక్టర్ మోహన్, జడ్పీసీఈవో కాంతమ్మ, డీపీవో శ్యాంసుందర్, ఇరిగేషన్ అధికారులు, మునిసిపల్ కమిషనర్లు ఉన్నారు.

నీటి సంరక్షణను బాధ్యతగా గుర్తించాలి

మానవ మనుగడకు నీరు కీలక ఆధారమని, నీటి సంరక్షణను ప్రతీ ఒక్కరు కనీస బాధ్యతగా గుర్తించాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి సంస్థ జాయింట్ సెక్రటరీ అమిత్‌శుక్లా అన్నారు. కేటిదొడ్డి రైతువేదిక వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు.

జలశక్తి అభియాన్ టెక్నికల్ అధికారి మధుసూదన్, డీఆర్‌డీవో నర్సింగరావు, అడిషనల్ డీఆర్‌డీవో నరసింహ, స్వయం సహాయక సంఘాల మహిళలు, రైతులు ఉన్నారు.

ఉమామహేశ్వరం ఆలయ హుండీ లెక్కింపు

» ఆదాయం రూ.9,90,285


హుండిని లెక్కిస్తున్న కమిటి సభ్యులు

అచ్చంపేటఅర్బన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉమామహేశ్వర క్షేత్రంలో శనివారం దేవాదాయ ధర్మదాయ శాఖ జిల్లా పరిశీలకులు వెంకటేశ్వరమ్మ, ఆలయ ఈవో శ్రీనివాస రావు కమిటీ చైర్మన్ బీరం మాధవరెడ్డి కమిటీ సభ్యులతో కలిసి హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. దాదాపు 6 నెలల 23 రోజులు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఉమామహేశ్వర ఆలయానికి వచ్చి హుండీలో వేసిన విరాళాలను లెక్కించారు. మొత్తం ఆదాయం రూ.9,90,285 వచ్చినట్లు ఆలయ ఈవో శ్రీనివాస్ రావు తెలిపారు. అచ్చంపేట ఎస్సై రమేష్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉదయం 11గంటలకు ప్రారంభమై సాయంత్రం 5గంటల వరకు లెక్కింపు నిర్వహించారు. వచ్చిన ఆదాయాన్ని సంబంధిత బ్యాంకుకు తరలించారు. శనివారం కావడంతో ఉమామహేశ్వర ఆలయంలో ఈశ్వరుడిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ సిబ్బంది రామకృష్ణ లక్ష్మీనారాయణ, కవికుమార్, దామోదర్, శేఖర్ ఉన్నారు.

పత్తి ధర తగ్గిస్తున్నారని రైతుల ధర్నా

- పత్తి తూకం చేయడంలో జాప్యం - ధర్నాతో పేట హైదరాబాద్ రోడ్డు దిగ్బంధం

నారాయణపేటరూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పత్తి తూకంలో జాప్యం చేయడంతో పాటు రోజురోజుకు మిల్లర్లు పత్తి ధరను తగ్గిస్తున్నారని రైతులు నారాయణపేట మండలంలోని అప్పక్‌పల్లి మిల్లు ముందు పేట, హైదరాబాద్ రహదారిపై ధర్నా చేపట్టారు. దీంతో దాదాపు గంట పాటు వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఈ సందర్భంగా బీకేఎస్ రాష్ట్ర నాయకుడు వెంకోబా, రైతులు మాట్లాడుతూ నెలరోజులుగా పత్తి అమ్మకానికి వస్తుందని ప్రారంభంలో రూ.9వేలు ధర పలకగా క్రమ క్రమంగా 7వేలు ప్రస్తుతం ఆరువేలకు పడిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నెలరోజుల్లోనే పత్తి ధరను 2నుంచి 3 వేల దాకా దింపడం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వం సీసీఐ ద్వారా పత్తిని కొనుగోలు చేస్తే రైతులకు ఇటువంటి ఇబ్బందులు ఉండవన్నారు. రైతులు తెచ్చిన పత్తిని తూకం చేయడంలో జాప్యం చేస్తుండటంతో రైతులు రోజుల తరబడి రోడ్డుమీదనే వాహనాలు ఆపుకుని ఉండాల్సి వస్తుందన్నారు.

విషయం తెలుసుకున్న బీకేఎస్ రాష్ట్ర జోనల్ కార్యదర్శి వెంకోబా తదితరులు అక్కడకు చేరుకుని మిల్లర్లతో మాట్లాడి రైతుల సమస్యలను పరిష్కరించాలన్నారు. మార్కెట్ కార్యదర్శి, తహసీల్దార్‌లతో మాట్లాడి ప్రతిరోజు 150 వాహనాలకు సరిపడా పత్తిని తూకం చేసేలా మిల్లర్లతో ఒప్పించారు. కార్యక్రమంలో పేట, ఊట్కూర్, దామరగిద్ద మండలాల రైతులు పాల్గొన్నారు.


వాగ్వాదానికి దిగిన పత్తి రైతులు


అప్పక్‌పల్లి మిల్లు దగ్గర అంతర్రాష్ట్ర రహదారిలో బైఠాయించిన పత్తి రైతులు

విద్యుదాఘాతంతో
జూనియర్ లైన్‌మన్ మృతి


శంకర్ (ఫైల్)

బల్మూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతానికి గురై జూనియర్ లైన్‌మన్ శంకర్ (32) మృతిచెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండల పరిధిలోని గోదల్ గ్రామ వ్యవసాయ పొలంలో శనివారం చోటు చేసుకుంది. విద్యుత్‌శాఖ ఏఈ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని కొండనాగుల గ్రామానికి చెందిన యువకుడు ప్రస్తుతం కొండారెడ్డిపల్లి సబ్‌స్టేషన్‌లో జూనియర్ లైన్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. విధినిర్వహణలోనే గోదల్ గ్రామానికి చెందిన రైతు మారం వెంకటయ్య పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ సమస్య ఉందని తెలుసుకొని చెన్నారం ఫీడర్ లైన్‌ను ఎల్‌సీ తీసుకొని ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేయడానికి వెళ్లారు. అక్కడే కొంత పొరపాటు జరిగింది. ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేసే ఫీడర్‌లైన్ బల్మూరు వచ్చే విషయాన్ని గమనించలేదు. అతడు చెన్నారం ఫీడర్ బంద్‌లో ఉందన్న విషయంతో మరమ్మతులు చేయడానికి పూనుకోగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య మంజుల, ఇద్దరు పిల్లలున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం అచ్చంపేట సివిల్ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఇంకా కేసు నమోదు కాలేదు.

కుక్కల దాడిలో మేక పిల్లలు మృతి

బిజినేపల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వసురాం తండా పంచాయతీ పరిధిలోని అలుగు తండాలో శనివారం కుక్కల దాడిలో పది మేక పిల్లలు మృతి చెందాయి. బాధిత దంపతులు నార్య నాయక్, చాందీలు తెలిపిన వివరాల ప్రకారం.. రోజులాగే మేకలను మేతకు తీసుకెళ్లగా పిల్లలను ఇంటి ముందు జల్ల కింద ఉంచారు. జల్లను పైకి లేపిన కుక్కలు మేక పిల్లలపై దాడి చేసి పదింటిని చంపేశాయి. సాయంత్రం ఇంటికి వచ్చి పరిశీలించగా రూ.80 వేల విలువైన మేక పిల్లలు మృతి చెంది ఉండడంతో బోరున విలపించారు. బాధితులకు ప్రభుత్వం నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని పలువురు గ్రామస్థులు కోరారు.

ఎలుగుబంటి దాడిలో వ్యక్తికి గాయాలు

పదర, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎలుగుబంటి దాడిలో పశువుల కాపరికి తీవ్రగాయాలైన ఘటన పదర మండలంలోని ఉడిమిళ్ల గ్రామంలో శనివారం ఉదయం వెలుగు చూసింది. గ్రామస్థుల కథనం ప్రకారం... నల్గొండ జిల్లా చందంపేట మండలం కాస్రాస్‌పల్లి గ్రామానికి చెందిన బద్దల అంజయ్యగా గుర్తించారు. ఆయన ఉడిమిల్ల గ్రామ శివారులో పశువులు మేపడానికి వచ్చాడని, ఈ సందర్భంలో ఎలుగుబంటి దాడి చేయగా గాయాలతో ఉడిమిల్ల గ్రామానికి వచ్చినట్లు తెలిపారు. అది చూసిన గ్రామస్థులు 108కు ఫోన్ చేసి అంబులెన్స్‌లో అచ్చంపేట సివిల్ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఇదే విషయంపై పదర పోలీసులను ఆంధ్రజ్యోతి వివరణ అడగగా తమకు ఫిర్యాదు అందలేదని హెడ్ కానిస్టేబుల్ బాలునాయక్ తెలిపారు.

బైకు అదుపుతప్పి ఒకరి మృతి

చారకొండ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శంషుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. చారకొండ మండల కేంద్రానికి చెందిన కేశమోని శ్రీనివాస్‌గౌడ్ (54) ఎముకలు విరిగిన వారికి కట్టుకడుతుండేవారు. శనివారం ఉదయం మండలంలోని సిర్సనగండ్లలో ఓ వ్యక్తికి కట్టుకట్టి చారకొండకు తిరిగి వస్తున్న క్రమంలో శాంతిగుడెం సమీపంలో బైక్ అదుపుతప్పి కిందపడడంతో శ్రీనివాస్‌గౌడ్ అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. హెడ్ కానిస్టేబుల్ శ్రీశైలం సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించాడు. మృతదేహాన్ని కల్వకుర్తి ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య చంద్రమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ శంషుద్దీన్ తెలిపారు.

- ప్రజల జీవన విధానంలో మార్పులు
- డబ్బుల వెంట పరుగెత్తుతున్న యువత
- వయస్సు పైబడ్డాక డబ్బుతో పాటే రోగాలు
- రెండు పూటలా రొట్టెలే తినాలని తపిస్తున్న నలభై ఏళ్ల పైబడ్డవారు

ఉడుకుడుకు రొట్టెలు


కొత్తకోటలో రొట్టెలు తయారు చేస్తున్న మహిళ


విక్రయానికి సిద్ధంగా ఉంచిన రొట్టెలు


కొత్తకోట పెబ్బేరు రోడ్డులో రొట్టెలు తయారు చేస్తున్న మహిళలు

కొత్తకోట, అక్టోబరు 26 : ఉడుకుడుకు రొట్టెలు ఉట్టి మీద ఉండగా ఓ నాథా.. అని ఈ మధ్య కాలంలో ఫోక్ సింగర్ ఆలపించిన పాట పాపులర్ అయినట్లుగానే పట్టణాల్లో రొట్టెలకు చాలా డిమాండ్ పెరిగింది. రోడ్ల వెంట ప్రతీ వంద మీటర్లకు ఒక రొట్టెల తయారీ కేంద్రం వెలిసింది. ఉదయం, రాత్రి వేళ రొట్టెలకు గిరాకీ చాలానే ఉంటుంది. రొట్టెల తయారీతో జీవనోపాధి పొందుతున్న మహిళల సంఖ్య నెలనెల పెరుగుతున్నది. రొట్టెల తయారీ సెంటర్లతో పాటు ఛాయ్ హోటళ్లకు బదులుగా రాగి మాల్ట్, మిల్లెట్ మాల్ట్ వెలుస్తున్నాయి.

ప్రజల్లో మారిన జీవన విధానం..

కాలానుగుణంగా ప్రజల జీవన విధానంలో మార్పులు చోటు చేసుకున్నాయి. జీవన విధానంతో పాటు ఆహారపు అలవాట్లు మారాయి. మనిషి డబ్బు వెనకాల పరుగెత్తుతూ సమయానికి ఏమి తింటున్నమో, ఎంత టైం నిద్ర పోతున్నమో తెలియని స్థితిలో కొందరు ఉన్నారు. వారికి బ్యాంక్ బ్యాలెన్స్ పెరిగినట్లుగానే వయస్సు పైబడ్డాక శారీరంలో రోగాలు పెరుగుతున్నాయి. ఆరోగ్యపరంగా మందులు వాడినా ఉదయం, రాత్రి వేళల్లో తినే తిండి తయారు చేసుకోలేక ఏ హోటల్‌లో మంచి ఆహారం దొరుకుతుందని ఆరా తీస్తున్నారు. హోటల్‌లో ఆయిల్ కలుస్తుందని భయపడి ఫుట్‌పాత్ (రోడ్డు) వెంట వెలసిన రొట్టెల తయారీ వద్దకు పరుగెత్తుతున్నారు. అలాగే ఛాయ్‌కు బదులుగా రోజుకు రెండుసార్లు రాగి పాలు, చిరు ధాన్యాలతో తయారు చేసిన జావ సేవిస్తున్నారు.

పెరిగిన రొట్టెల తయారీ..

జిల్లాల్లో రోజురోజుకు రొట్టెల తయారీ కేంద్రాలు పెరుగుతున్నాయి. జిల్లా కేంద్రంతో పాటు కొత్తకోట, పెబ్బేర్, ఆత్మకూర్, అమరచింత మునిసిపాలిటీలలో రొట్టెల పొయ్యి వెలుగుతున్నది. ఒక రొట్టె పది నుంచి పన్నెండు రూపాయలకు విక్రయిస్తున్నారు. రొట్టెకు తోడుగా కూరగాయల కర్రి, పప్పు అయితే మరో పది రూపాయలు ఎక్కువగా తీసుకుంటున్నారు. ప్రతీ రొట్టె తయారీ కేంద్రంలో సామగ్రికి పోనూ రూ. 500 పైగానే సంపాదిస్తున్నారు.

ఉదయం, రాత్రి రొట్టెలే తింటున్నా..



వివిధ పనులపై పట్టణాల్లో ప్రయాణం చేస్తున్న సందర్భాల్లో చాలా మంది రొట్టెలు తినాలని చూస్తున్నారు. ఏంటని అడిగితే రకరకాల వ్యాపారం చేస్తూ డబ్బులు పోగు చేసుకున్నట్లుగానే రోగాలు కూడా వచ్చాయని తెలుసుకున్నాను. అప్పటి నుంచి ఇంట్లో రొట్టెలు చేయించుకొని ఉదయం, రాత్రి పూట తింటున్నాం.

\- బాలరాజు, కానాయపల్లి

రెండు పూటలా జావ తాగుతున్నాం..



రోజు రెండు పూటల మిల్లెట్ హోటల్‌లో చిరు ధాన్యాలతో తయారు చేసిన జావ తాగుతున్నాం. ఉదయం వాకింగ్ చేసిన ఫ్రెండ్స్ అందరం కచ్చితంగా హోటల్‌కు వచ్చి జావనే తాగుతున్నాం. జావ అలవాటు చేసుకోవడంతో ఆరోగ్యం బాగవుతుంది. వాకింగ్‌కు పోనిరోజు ఫ్రెష్ అయిన వెంటనే టీకి బదులుగా జావ కోసం మిల్లెట్ హోటల్‌కు వెళుతున్నాం.

\- భీమా కిషోర్, కొత్తకోట

రొట్టెల తయారీతో జీవనోపాధి



రొట్టెల తయారీతో జీవనోపాధి పొందుతున్నా. వ్యవసాయ పనులు ఎప్పుడు ఉండటం లేదు. రెండేళ్ల కిందట రొట్టెలు చేసి ఇస్తే డబ్బులు ఇస్తానని ఇంటి పక్కన ఉన్న ఓ పెద్ద మనిషి అడిగాడు. అలా మొదలైన రొట్టెల తయారీతో ఉపాధి పొందవచ్చని డబ్బు పెట్టుకోకున్నాను. అన్ని ఖర్చులు పోను రోజుకు రూ. 500కు పైగానే మిగులుతున్నాయి.

\- శారద, కొత్తకోట

ఎస్‌ఐని సస్పెండ్ చేయాలి

-ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి
- పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర పౌరహక్కుల సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ లక్ష్మణ్

లింగాల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల సంచలనం సృష్టించిన ముగ్గురు యువకుల శిరోమండనానికి బాధ్యులైన లింగాల ఎస్‌ఐ జగన్మోహన్‌ను సస్పెండ్ చేసి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ డిమాండ్ చేశారు. శనివారం లింగాల మండలానికి వచ్చిన ఆయన బాధిత కుటుంబ సభ్యులను కలిసి శిరోముండనం ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు సేకరించారు. అనంతరం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీన ముగ్గురు యువకుల శిరోముండనం జరిగిన ఘటనలో ఎస్‌ఐ జగన్‌మోహన్ చట్టాన్ని తన చేతిలోకి తీసుకొని అత్యుత్సాహంగా ప్రవర్తించినట్లు తమ విచారణలో తేలిందన్నారు. యువకులను స్టేషన్‌లో ఉంచుకొని మూడు రోజుల పాటు చిత్రహింసలు పెట్టారని ఆయన ఆరోపించారు. ఈ సంఘటనలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు మరణిస్తే ఎవరు బాధ్యులు అవుతారని ఆయన ప్రశ్నించారు. ఎస్‌ఐపై చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి రఘునాథ్, సుభాన్, బాలయ్య పాల్గొన్నారు.

విద్యుత్ వైరు తెగిపడి మహిళ మృతి

- బాధిత కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ధర్నా


నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఎదుట ధర్నా చేస్తున్న బీఎస్పీ, కేవీపీఎస్ నాయకులు

నాగర్‌కర్నూల్ క్రైం/ నాగర్‌కర్నూల్ టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వైర్ తెగిపడి కూర భాగ్యమ్మ (28)మృతి చెందినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ శనివారం తెలిపారు. నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ పరిధిలోని దేశిఇటిక్యాల గ్రామంలో శనివారం తెల్లవారు జామున వాకిలి ఊడుస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ వైరు తెగి భాగ్యమ్మపై పడడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి భర్త కూరస్వామి బయటికి వచ్చి చూసి బోరున విలపించాడు. చుట్టు పక్కల వారు గమనించి విద్యుత్ అధికారులకు సమాచారం అందించి కరెంటు సరఫరాను నిలిపివేశారు. మృతురాలి భర్త కూరస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. భాగ్యమ్మ కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి కుటుంబంలో ఒకరిని ప్రభుత్వం ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఎదుట బైఠాయించి బీఎస్పీ, కేవీపీఎస్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, బక్క కృష్ణ, రాములు, చంద్రయ్య, బీఎస్పీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సతీష్ కుటుంబాన్ని ఆదుకుంటాం


మద్దూరులో ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

సతీశ్ ఇంటికి వెళ్లారు. దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొని, సతీశ్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. సతీశ్ తండ్రి పార్టీ సీనియర్ నాయకుడు కల్లప్ప శివరాజ, తల్లి శమంతకమ్మ, భార్య సంగీత, ఇద్దరు కుమారులు వీరేశ్, ఆదిత్య, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు. తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సతీశ్ మృతికి గల కారణాలను తెసుకున్నారు. ఈ సందర్భంగా సతీశ్ భార్య సంగీతతోపాటు తల్లిదండ్రులు సీఎం ఎదుట బోరున విలపించారు. కుటుంబాన్ని పోషించే సతీష్ అకాల మరణంతో తాము దిక్కులేనివారం అయ్యామని, తమ కుటుంబాన్ని ఆదుకోవాలని భార్య సంగీత సీఎం కాళ్ల మీద పడి విలపించింది. తన పిల్లలు వీరేశ్, ఆదిత్య ఉన్నత చదువుల కోసం సహాయం చేయాలని కోరింది. వాలీబాల్‌లో జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చిన సతీశ్ తమ్ముడు మణికంఠకు స్పోర్ట్స్ కోటాలో, బీఈడీ పూర్తి చేసిన సతీశ్ సోదరి వీరమణికి ఉద్యోగ అవకాశం కల్పించాలని సీఎంకు వినతిని అందించింది. స్పందించిన సీఎం వాటిని పరిశీలించాలని కాడా అధికారి వెంకట్‌రెడ్డిని ఆదేశించారు. సతీశ్ మృతి కాంగ్రెస్ మండల కమిటీకి తీరని లోటని, అతని కుటుంబాన్ని పార్టీ అన్ని విధాల ఆదుకుంటుందని భరోస ఇచ్చారు. అనంతరం మధ్యాహ్నం 12:30 గంటలకు సీఎం తిరుగు ప్రయాణం అయ్యారు. మక్తల్, పరిగి, తాండూరు ఎమ్మెల్యేలు వాకిటి శ్రీహరి, రాంమోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజయ్‌కుమార్, డీసీసీ చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి, కోస్గి మార్కెట్ కమిటీ చైర్మన్ భీములు, మద్దూర్ జడ్పీటీసీ మాజీ సభ్యుడు రఘుపతిరెడ్డి తదితరులు సతీష్‌కు నివాళులు అర్పించారు.

శాంపిల్ దందా

(మొదటి పేజీ తరువాయి)

ఇస్తున్నారు. అదేవిధంగా అరిస్ట్రో, మానికైండ్, సిప్ల, ఐస్టా, డాక్టర్ రెడ్డీస్ వంటి ప్రముఖ కంపెనీల ఫిజీషియన్ శాంపిల్ మందులు ఎక్కువగా డాక్టర్లే విక్రయిస్తున్నారు. డాక్టర్లకు చెందిన కొన్ని క్లినిక్స్, నర్సింగ్ హోమ్, ఆసుపత్రులలో అధికంగా అమ్ముతున్నారు. అందులో యాంటిబయాటిక్స్, గుండె, నరాలు వంటి పెద్ద రోగాలకు సంబంధించినవి మందులూ ఉంటున్నాయి. అయితే చాలా మంది ఫిజీషియన్ శాంపిల్ నాట్ ఫర్ సేల్ అనే పేరును స్కెచ్, మార్కర్‌తో తుడిచి విక్రయిస్తుండటం గమనార్హం.

సగం ధరకే విక్రయం

జిల్లాలో సేల్స్ రిప్రజెంటేటివ్స్ దాదాపు 300 నుంచి 400 మంది వరకు ఉన్నారు. వీరంతా అన్ని కంపెనీలకు సంబంధించిన వారు కావడంతో శాంపిళ్లు కూడా ఎక్కువగానే వస్తుంటాయి. వారికి వచ్చిన శాంపిళ్లలో 30 శాతం మాత్రమే డాక్టర్లకు ఇచ్చి, మిగతా 70 శాతం బయటి వాళ్లకు విక్రయిస్తున్నారు. అందులో ఆర్‌ఎంపీలే ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. యాంటిబయాటిక్స్, సిరప్‌లు, మల్టీవిటమిన్ మాత్రలు అధికంగా ఉంటున్నాయి. వాటిపై ఎంఆర్‌పి ధర రూ.150 ఉండగా, దాన్ని రూ.60 నుంచి రూ.80 వరకు అమ్ముతున్నారు. ఒక రేటు మాట్లాడుకుని బల్క్‌గా కూడా అమ్ముతున్నారు.



నిద్ర పోతున్న ఔషధ నియంత్రణ శాఖ

జిల్లాలో ఔషధ నియంత్రణ శాఖ నిద్రమత్తులో తూలుతోంది. శాంపిల్ దందాలు, ఆర్‌ఎంపీల మందుల విక్రయాలపై ఇప్పటి వరకు ఒక్క కేసు కూడా నమోదు చేయలేదు. కనీసం దాడులు కూడా చేసిన దాఖలాలు లేవు. దీంతో వారు ఆడిందే ఆటగా సాగుతోంది. అంతేకాకుండా మెడికల్ ఏజెన్సీలలో కూడా తనిఖీలు చేయలేదు. ఈ విషయంపై జిల్లా ఔషధ నియంత్రణ అధికారిని వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆమె అందుబాటులోకి రాలేదు.

గ్రామీణ ప్రాంతాల్లోని ఆర్‌ఎంపీలే కీలకం

శాంపిళ్ల దందా గ్రామీణ ప్రాంతాల్లోనే ఎక్కువగా కొనసాగుతోంది. గ్రామాల్లో ఉండే ఆర్‌ఎంపీలు మెడికల్ రిప్రజెంటేటివ్స్ వద్ద ఆ మందులను కొనుగోలు చేసి, వారి క్లీనిక్‌లలో సామాన్య రోగులకు అమ్ముతున్నారు. అంతేకాకుండా మెడికల్ దుకాణాల్లో డాక్టర్ కన్సల్టెన్సీతో విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. చదువుకున్న వారికి కాకుండా సామాన్యులకు అంటగడుతున్నారు. గ్రామాల్లోని ఆర్‌ఎంపీల ఇళ్లల్లో ఈ శాంపిల్ మందుల డబ్బాలు పేరుకుపోయాయి. కోయిలకొండ, దేవరకద్ర, రాజాపూర్, అడ్డాకుల, సీసీ కుంట, బాలానగర్, మహ్మదాబాద్, మిడ్జిల్ మండలాల్లోని గ్రామాల ఆర్‌ఎంపీల ఇళ్లలో స్టాక్ ఫుల్‌గా ఉంది. మరోవైపు ఆర్‌ఎంపీలు ఈ శాంపిళ్లు కొనుగోలు చేసి, మెడికల్ దుకాణాలలో పెట్టి విక్రయిస్తున్నారు.

కర్నిలో దొంగతనం

నగదు, బంగారం అపహరణ


దొంగతానికి పాల్పడిన ఇంట్లో చిందరవందరగా పడిన వస్తువులు, తెరిచి ఉన్న బీరువా

మక్తల్‌రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా మక్తల్ మండలంలోని కర్ని గ్రామంలో రెండురోజులు వరుసగా రెండు ఇళ్లల్లో గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. ధనలక్ష్మి కాలనీలోని దామొల్ల గుంటప్పగౌడ్ ఆటోడ్రైవర్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం ఉదయం ఆయన భార్య పొలం పనులకు వెళ్లగా ఆయన ఆటో తీసుకొని బయటకు వెళ్లాడు. మధ్యాహ్న సమయంలో పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన పిల్లలు తలుపు తాళం విరగ్గొట్టి ఉండడాన్ని గమనించి చుట్టుపక్కల వారికి తెలిపారు. దీంతో వారు గుంటప్పగౌడ్‌కు సమాచారమందించారు. ఇంటికి వచ్చి పరిశీలించిన ఆయన బీరువాలో దాచి ఉంచిన రూ.60 వేలు నగదు చోరీ జరిగిందని గమనించి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. శనివారం ఇదే కాలనీలో ఉప్పరి చంద్రకళ ఇంటికి తాళం వేసి పొలం పనులకు వెళ్లింది. మధ్యాహ్న సమయంలో చంద్రకళ కుమారుడు ఇంటికి రాగా తలుపు తాళం తెరవకముందే కింద పడడంతో అనుమానాస్పదంగా ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న రూ.2 లక్షల నగదు చోరీ జరిగిందని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై భాగ్యలక్ష్మిరెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

జూరాల కాల్వలో పడి రైతు మృతి

గద్వాల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవవశాత్తు జూరాల కాల్వలో పడి ఓ రైతు మృతి చెందాడు. ఈ సంఘటన జోగులాంబ గద్వాల జిల్లాలో శనివారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మదనపల్లి గ్రామానికి చెందిన సవరన్న అలియాస్ షరీఫ్(55) అనే రైతు తెలుగు సవరన్న జూరాల కాలువకు మోటారు వేసి వ్యవసాయం చేస్తున్నాడు. శనివారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో మోటారు ఆన్ చేయగా చెత్త తట్టుకున్నట్లు గుర్తించి, కాలువలోకి దిగాడు. చెత్త తొలగించినా మోటారు ఆన్ కాకపోవడంతో మళ్లీ కాలువలోకి దిగి నీట మునిగాడు. గమనించిన చుట్టు పక్కల వారు జూరాల అధికారులకు సమాచారం ఇవ్వడంతో కాలువకు నీటి విడుదల నిలిపివేశారు. ఆ తర్వాత వెతకగా మునిగిన చోటు నుంచి కొంతవరకు కొట్టుకుపోయి ముళ్ల పొదకు తట్టుకొని ఉండటంతో 6:30 గంటల సమయంలో శవాన్ని బయటకు తీశారు. మృతుడికి భార్య శంకరమ్మతోపాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు.

గుర్తు తెలియని శవం లభ్యం

అలంపూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూరు మండలం జిల్లెలపాడు గ్రామ శివారులోని తుంగభద్రా నదీ తీరాన ఓ గుర్తు తెలియని మహిళా శవం దొరికినట్లు శనివారం ఎస్‌ఐ వెంకటస్వామి తెలిపారు. ఆమె ఎరుపు రంగు జాకెట్ ధరించి ఉందని, వయస్సు 45 నుంచి 55 సంవత్సరాలు ఉంటుందన్నారు. ఆచూకి తెలిసిన వారు 8712670285 సంప్రదించి వివరాలు తెలపాలని ఎస్‌ఐ తెలిపారు.

ఎట్టకేలకు అడుగు ముందుకు

- డిజిటల్ సర్వేకు కదిలిన వ్యవసాయ విస్తరణ అధికారులు

అయిజ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆవాంతరాల మధ్యన పంటల డిజిటల్ సర్వేకు ఎట్టకేలకు అడుగు ముందుకు పడింది. సమస్యల మధ్య మేము సర్వే చేయలేమని 45 రోజులుగా భీష్మించుకు కూర్చున్న వ్యవసాయ విస్తరణ అధికారులు మూడు రోజులుగా ఒక్కొక్కరు కదులుతున్నారు. కేంద్ర ప్రభుత్వం పంటల డిజిటల్ సర్వే చేయాలని వ్యవసాయ విస్తరణ అధికారులకు శిక్షణ ఇచ్చి యాప్‌ను అందించింది. పని ఒత్తిడి, ఎదురవుతున్న ఇబ్బందుల కారణంగా సర్వే చేయలేమని తేల్చి చెప్పారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో 96 మంది రెగ్యులర్ వ్యవసాయ విస్తరణ అధికారులు ఉన్నారు. 14 మంది కాంట్రాక్టు పద్ధతిపై పని చేస్తున్నారు. నలుగురు ఆత్మ ఉద్యోగులకు సైతం వ్యవసాయ విస్తరణ అధికారులుగా గ్రామాలకు ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు. కాంట్రాక్టు ఉద్యోగులు రూ. 17 వేల జీతంపై, ఆత్మ ఉద్యోగులు రూ.30 వేల జీతంపై పని చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం సమగ్ర వ్యవసాయంపై రూ పొందించిన ఈ యాప్ ద్వారా క్షేత్ర స్థాయిలో రైతులు సాగు చేస్తున్న భూముల వివరాలను నమోదు చేయాల్సి ఉంది. సర్వే కోసం కేంద్రం నిధులు కేటాయించింది. కర్నాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ప్రత్యేక వాలంటీర్లను ఏర్పాటు చేసి సర్వే చేపిట్టింది. తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ విస్తరణ అధికారులు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. దీనిని వ్యతిరేకిస్తూ నిరసనలు, వినతి పత్రాలు అందచేశారు. మండి పడ్డ ఉన్నతాధికారులు గత నెల 24వ తేదీ, ఈ నెల 9వ తేదీన సర్వే పనులు ప్రారంభించాలంటూ వ్యవసాయ విస్తరణ అధికారులకు మెమోలు జారీ చేసింది. అయినా స్పందించలేదు. కొన్ని కారణాలు చూపుతూ ప్రభుత్వం కొంత మంది ఉద్యోగుల విధుల నుంచి తప్పించింది. ఒక్కొక్కరికి సమస్యలు రావటం మొదలయ్యాయి. దీనితో వచ్చే ఆవాంతరాలకు ఎదురు వెళ్లి నిలవలేమని భావించిన అధికారులు సర్వే కోసం అడుగు ముందుకు వేశారు. గ్రామాలలో వ్యవసాయం చేస్తున్న వారి వివరాలే కాకుండా సాగులోకి వస్తున్న భూములు, పంటలను డిజిటల్ సర్వే నమోదు చేయటం ద్వారా వ్యవసాయ శాఖ క్షేత్ర స్థాయి పట్టు సాధించే వీలుంటుందని ఈ సర్వే యొక్క ముఖ్య ఉద్దేశ్యంగా అధికారులు చెబుతున్నారు.

ఉద్యోగిగా బాధ్యతలు నిర్వహించాలి

ప్రతీ ఉద్యోగి తనకు అప్ప గించిన పనులు చేయాల్సిందే. మా వ్యవసాయ విస్తరణ అధికారులు వారికి నిర్దేశించిన బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సమస్యలు ఉన్నమాట వాస్తవమే, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాము. పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రతీ వ్యవసాయ విస్తరణ అధికారి గ్రామాలలో సర్వే చేయాలి.

-వ్యవసాయాధికారి షక్రియనాయక్

పెండింగ్ స్కాలర్‌షిప్స్ ఇవ్వాలి

- ఏబీవీపీ ఆధ్వర్యంలో ధర్నా
- విద్యార్థులతో కిక్కిరిసిన తెలంగాణ చౌరస్తా

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల పెండింగ్ స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో శనివారం తెలంగాణ చౌరస్తాలో ధర్నా చేశారు. ధర్నాకు విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరుకావడంతో చౌరస్తా కిక్కిరిసింది. ఈ సందర్భంగా సంఘం జిల్లా కన్వీనర్ సతీష్ మాట్లాడుతూ ఏళ్ల తరబడి స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో పేద విద్యార్థులు విద్యకు దూరం అవుతున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.7,500 కోట్లపైగా బకాయి ఉన్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి దాదాపు ఏడాది కావొస్తున్నా బకాయిలు చెల్లించడం లేదన్నారు. ప్రైవేటు కళాశాలల్లో డిగ్రీ, పీజీ తదితర కోర్సులు పూర్తి చేసిన వారికి యాజమాన్యాలు సర్టిఫికెట్స్ ఇవ్వడం లేదని, ఫీజులు చెల్లిస్తేనే ఇస్తామని అంటున్నాయని చెప్పారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శివప్రసాద్, శివసాగర్, అక్షయ, కార్తీక్‌చ శివరామ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..



గ్రామాల అభివృద్ధికి కృషి

ఎంపీడీవో కె.కృష్ణమోహన్

కేటీదొడ్డి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేయడంతో పాటు గ్రామాల్లో ఏ సమస్య తలెత్తినా వెంటనే పరిష్కరిస్తామని ఎంపీడీవో కె.కృష్ణ మోహన్ అన్నారు. శనివారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు.

గ్రామాల్లో తాగునీటి సమస్య ఉందా?

గ్రామాల్లో తాగునీటి సమస్యలు లేవు. ఎక్కడైనా చిన్నచిన్న లీకేజీలు ఉంటే పంచాయతీ కార్యదర్శి, వాటర్‌మెన్‌లు మరమ్మతు చేసి లీకేజీ సమస్య లేకుండా చూస్తారు.

పారిశుధ్యం లోపించినట్లు విమర్శలు వస్తున్నాయి. దీనిపై మీ స్పందన ?

అన్ని గ్రామాల్లో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నాం. ఎక్కడైన సమస్యలు ఉంటే మా దృష్టికి తీసుకొస్తే పరిశీలించి పరిష్కరిస్తాం.

వీధి కుక్కల సమస్యపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

ఇప్పటికే పలు గ్రామాల ప్రజలు వీధి కుక్కల గురించి మా దృష్టికి తీసుకొచ్చారు. వీధి కుక్కలను పట్టుకొనే వారికి సమాచారం అందించాం. వాళ్లు వచ్చిన వెంటనే కుక్కలను తరలించే ఏర్పాటు చేస్తాం.

న్యూస్ బాక్స్

ఆలయ నిర్మాణానికి విరాళం

అయిజ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : శాంతినగర్‌లో నిర్మించే అయ్యప్ప ఆలయ నిర్మాణానికి శనివారం సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు సంకాపూర్ రాముడు రూ.50 వేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో అయ్యప్ప భక్తులు ఉమామహేష్, భాస్కర్‌రావు, మధు, వీరేష్‌గౌడు, గజేంద్ర, శివ, తరణ్ పాల్గొన్నారు.

మండల ప్రత్యేకాధికారిగా గోవిందయ్య

గట్టు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : గట్టు మండల ప్రత్యేకాధికారిగా చేనేత జౌళిశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ గోవిందయ్య శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యాలయ సూపరింటెండెంట్ రఘునందన్ స్వాగతం పలికారు.

రేపు జాబ్ మేళా

గద్వాల టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ కో ఎడ్యుకేషన్ జూనియర్ కళాశాలలో సోమవారం హెటిరో కంపెనీ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి ఎం.హృదయరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్‌సీలో 60 శాతం, ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీలో 55 శాతం మార్కులతో 2022-23, 2023-24 విద్యా సంవత్సరాల్లో ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులన్నారు. అభ్యర్థులు ఆధార్ కార్డు, ఒరిజినల్ ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్ ధ్రువపత్రాలు తీసుకురావాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ప్రయాణ ఖర్చులు, వసతి సౌకర్యం, అలవెన్స్‌లు కంపెనీ అందజేస్తుందన్నారు.

రెండో విడత పాఠ్య పుస్తకాలు పంపిణీ

మానవపాడు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రభుత్వ పాఠశాలకు రెండో విడత పాఠ్యపుస్తకాలు ఎంఈవో శివప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ విద్యార్థికి పార్ట్ 2 పాఠ్యపుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, ఆయా పాఠశాల హెచ్ఎంలు తీసుకెళ్లాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

అలంపూర్ చౌరస్తా, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఉండవల్లి మండలం ఇటిక్యాలపాడు గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి స్వల్పగాయాలు అయ్యాయి. శనివారం కడప నుంచి హైదరాబాదు వైపు వెళ్తున్న కారు ఘర్‌దాబా వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొంది. కారులో ఉన్న కృష్ణారెడ్డికి తలకు గాయాలు కాగా, మరొకరికి స్వల్ప గాయాలు కాగా చికిత్స నిమిత్తం కర్నూలు ఆసుపత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గద్వాల క్రైం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గాయాలైన రిటైర్డ్ హెచ్ఎం కృష్ణారెడ్డి (60) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు పట్టణ ఎస్ఐ కళ్యాణ్‌కుమార్ తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం.. గద్వాల పట్టణంలోని ధరూర్ మెట్టు సమీపంలో మోటార్ బైక్‌పై పట్టణానికి చెందిన కృష్ణారెడ్డి రెండు రోజుల క్రితం రోడ్డును దాటుతుండగా 102 అంబులెన్స్ బైక్‌ను ఢీకొనడంతో కృష్ణారెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం

వడ్డేపల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో జరుగుతున్న నేరాలు, వాటిని అరికట్టే విధానాలు, చట్టాలపై విద్యార్థులకు అవగాహన అవసరమని ఎంపీడీవో రామకృష్ణ అన్నారు. శనివారం వడ్డేపల్లి పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపాల్ సునీల్ అధ్యక్షతన విద్యార్థులకు హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో నరసింహ, మహిళా స్త్రీ శిశు సంక్షేమ శాఖ సభ్యురాలు లక్ష్మీదేవి, కళాశాల సిబ్బంది, ఎంపీఎఫ్ వెంకటేష్ ఉన్నారు.



మానవపాడులో రోడ్డుపైనే కొనసాగుతున్న సంత



రోడ్డుపైనే వాహనాలు పార్కింగ్ చేసిన కొనుగోలుదారులు

సంతలో అన్నీ సమస్యలే

» ఇబ్బందుల్లో వ్యాపారులు

» మార్కెట్‌ను ఏర్పాటు చేయాలంటున్న ప్రజలు

మానవపాడు అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : కొన్నేళ్లుగా మండల కేంద్రంలో ప్రతీ బుధవారం వారంపు సంత జరుగుతోంది. గతంలో గాంధీ చౌక్ ఆవరణలో నిర్వహిస్తున్న సంతను ప్రస్తుతం రైతువేదిక సమీపంలో నిర్వహిస్తుండగా, ఈ సంతకు మానవపాడు, అమరవాయి, చెన్నిపాడు, చిన్నపోతులపాడు, పెద్దపోతులపాడు, గోకులపాడు, పెద్ద ఆముదలపాడు, నారాయణపురం గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు వచ్చి కూరగాయలు కొనుగోళ్లు చేస్తుంటారు. అదే విధంగా కర్నూల్, శాంతినగర్, అయిజ, అలంపూర్ పరిధిలోని వ్యాపారులు సైతం వస్తుంటారు. కాగా ఈ సంతలో కనీస వసతులు లేకపోవడంతో వ్యాపారులు, ఇటు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారు. గతంలో గ్రామ పంచాయతీ పరిధిలో సంత వేలం వేసి వచ్చిన ఆదాయాన్ని సమకూర్చుకునేవారు. పంచాయతీకి ఆదాయం లేకపోవడంతో కనీస వసతులు కల్పించడం లేదు. కరెంటు సదుపాయం లేకపోవడంతో ఎండలోనే సంతను ఏర్పాటు చేసి, ముగిస్తున్నారు. దీంతో కూలీ పనులకు వెళ్లేవారు ఇబ్బందులకు గురౌతున్నారు. వర్షం కురిస్తే వ్యాపారులు ఎక్కడి వెళ్లాలో తెలియని పరిస్థితి. సరకులు తడిసిన తరువాత అక్కడే వదిలేసి వెళ్లే పరిస్థితి ఏర్పడిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా మరుగుదొడ్లు లేవు. కూరగాయలు విక్రయించే షెడ్డు లేకపోడంతో నేలపైనే కవర్లు వేసుకుని కూరగాయలు విక్రయిస్తుంటారు. ప్రతీ వారం సంతకు వచ్చిన వ్యాపారులు, ప్రజలు వాహనాలు నిలిపేందుకు స్థలం లేకపోవడంతో వివిధ కాలనీల్లో వాహనాలను నిలిపి ఇబ్బందులు పడుతున్నారు. ఎంపీడీవో భాస్కర్‌ను వివరణ కోరగా సంతలో సమస్యల విషయంపై ఉన్నతాధికారులకు వివరించి, సమస్యలు తీర్చేందుకు కృషి చేస్తామని వివరించారు.

కనీస వసతులు కల్పించాలి



ఇతర ప్రాంతాల నుంచి వచ్చి కూరగాయలు అమ్ముకుంటున్నాం. నేలపైనే కవర్లు వేసుకుని వ్యాపారాలు చేస్తున్నాం. కనీస మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు.

\- వ్యాపారి సైదా బేగం

వసతులుంటే ఇబ్బంది ఉండదు



వ్యాపారులకు, ప్రజలకు కనీసం తాగునీరు, మరుగుదొడ్లు ఏర్పాటుతో కరెంట్ వసతి ఉంటే సంత మరింత అభివృద్ధి చెందుతోంది. కొత్త వ్యాపారస్తులు రావాలంటే ఇబ్బందికి గురౌతున్నారు.

\- వ్యాపారి రాఘవేంద్ర

జిల్లా సమగ్ర అభివృద్ధికి పోరాడాలి

» సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లి » ముగిసిన జిల్లా మహాసభలు



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లి

గద్వాల టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా సమగ్ర అభివృద్ధికి పార్టీ తరఫున ఉధృత పోరాటాలు సాగించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆర్థిక, అంగ బలాలతో పీడిత ప్రజలపై ఆధిపత్యం చెలాయిస్తున్న అగ్రకుల భూస్వాములకు వ్యతిరేకంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను చైతన్యవంతం చేస్తూ ప్రజా ఉద్యమంలో వారిని భాగస్వాములు చేయాలన్నారు. పట్టణంలోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన సీపీఎం జిల్లా స్థాయి మూడవ మహాసభలు శనివారం ముగిసాయి. ముగింపు సభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మహాసభల సందర్భంగా తీర్మానించిన అంశాలపై పాలకులను నిలదీస్తూ అభివృద్ధి కోసం జిల్లా నూతన కమిటీ తగిన ఉద్యమ కార్యాచరణ నిర్ణయించుకోవాలని సూచించారు. మహాసభల ముగింపు సందర్భంగా జూరాల ప్రాజెక్టులో పూడికతీతను చేపట్టి నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచాలని, ర్యాలంపాడు రిజర్వాయర్‌కు మరమ్మతు, గట్టు ఎత్తిపోతల పనులు పూర్తిచేసి 33 వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వాలని, తుమ్మిళ్ల, మల్లమ్మకుంటు రిజార్వాయర్ పనులు ప్రారంభించాలని తీర్మానించారు. జిల్లాలో సీడ్ పత్తి పెద్దఎత్తున సాగు చేస్తున్న నేపథ్యంలో ట్రై పార్టీ ద్వారా కంపెనీలు రైతులతో నేరుగా ఒప్పందం చేసుకోవాలన్నారు. పర్యావరణ కాలుష్యాన్ని నియంత్రించాలని, యథేచ్ఛగా సాగుతున్న కంకర, ఇసుక, మొరం అక్రమ రవాణాను నియంత్రించాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని 300ల పడకలకు పెంచాలని, అలంపూర్ చౌరస్తాలోని ఆసుపత్రిని వెంటనే పూర్తి చేయాలని, నిర్మాణం పూర్తి అయిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేయాలని, మూతపడిన బీచుపల్లి విజయవర్ధిని ఆయిల్ మిల్లును పునరుద్ధరించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. జిల్లా కేంద్రంలో కార్మికుల ఆరోగ్య భద్రత కోసం ఈఎస్ఐ ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని తీర్మానించారు. అంతకుముందు 11 మంది సభ్యులతో సీపీఎం జిల్లా నూతన కమిటీని ఏర్పాటు చేశారు. కార్యదర్శిగా ఏ.వెంకటస్వామితో పాటు కమిటీ సభ్యులుగా వీవీ నరసింహ, ఉప్పేరు నరసింహ, జి.రాజు, రేపల్లె దేవదాసు, పరంజ్యోతి, మద్దిలేటి, ఈదన్న, నర్మద, రమేష్ ఎన్నికయ్యారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎంవీ రమణ పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి



పీజీ కేంద్రం వద్ద నూతన కమిటీ నాయకులతో జిల్లా కన్వీనర్ గణేష్

గద్వాల టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో జాతీయవాదాన్ని, దేశభక్తిని పెంపొందించడమే లక్ష్యంగా ఏర్పాటైన అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తున్నట్లు యూనియన్ జిల్లా కన్వీనర్ గణేష్ తెలిపారు. అందులో భాగంగానే జిల్లా కమిటీతో పాటు అన్ని డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. శనివారం పట్టణ సమీపంలోని గద్వాల పీజీ కేంద్రంలో పాలమూరు యూనివర్సిటీకి సంబంధించి నూతన కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా బి.భాస్కర్, ఉపాధ్యక్షుడిగా కే.ప్రవీణ్, మహిళా ఉపాధ్యక్షురాలిగా అరుణ, ప్రధాన కార్యదర్శిగా ప్రకాష్, సంయుక్త కార్యదర్శులుగా కే.పవన్, నరేష్, మహేశ్వరితో పాటు పీజీ కళాశాల ఇన్‌చార్జిగా పాండు, హాస్టల్ ఇన్‌చార్జి జె.సునీత, కళాశాల కల్చరల్ సభ్యురాలిగా శిరీష ఎన్నికయ్యారు.

'బండ్ల రాజశేఖర్‌రెడ్డిని అరెస్ట్ చేయాలి'

గద్వాల క్రైం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : బాల కార్మికురాలు వడ్డెర రాజేశ్వరి ఆత్మహత్యకు కారణమైన సీడ్ ఆర్గనైజర్ బండ్ల రాజశేఖర్‌రెడ్డిని అరెస్ట్ చేయాలని శనివారం వివిధ పార్టీల, ప్రజా సంఘాలు, పౌర, విద్యార్థి, కార్మిక, విద్యావేత్తల మేధావుల సంఘాలు, అఖిల పక్ష సంఘ నాయకులు ఎస్పీ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మల్దకల్ పోలీస్ స్టేషన్‌కు బాలికను పిలిపించి విచారించిన పోలీసులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. బాలిక మృతికి కారణమైన సీడ్ ఆర్గనైజర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్ చేయాల్సిన పోలీసులు ఆయనకు వత్తాసు పలుకుతూ ఇంతవరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. బండ్ల రాజశేఖర్‌రెడ్డిపై చర్యలు తీసుకోకుంటే ఉద్యమాలు చేస్తూమంటూ హెచ్చరించారు. అఖిల పక్ష కమిటీ నాయకులు జ్యోతి, గోపాల్, అతికూర్ రహిమాన్, ప్రభాకర్, ఆంజనేయులు, కుర్వ పల్లయ్య, ఆకేపోగు రాజు, వినోద్‌కుమార్, దానయ్య, ఆటో మక్బూల్ ఉన్నారు.

బాలికపై కేసు పెడితే పోలీసులు ఎలా ప్రశ్నిస్తారు?



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి

గద్వాల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : సీడ్ ఆర్గనైజర్ బండ్ల రాజశేఖర్‌రెడ్డి బాలికపై దొంగతనం మోపితే పోలీసులు ఎలా ప్రశ్నిస్తారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ప్రశ్నించారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో సున్నితంగా వ్యవహరించాల్సిన పోలీసులు బండ్ల రాజశేఖర్‌రెడ్డికి సహకరించడంతోనే అవమానం భరించలేక ఆత్మహత్యాత్నం చేసుకొని మృతి చెందిందని, ఇందుకు కారణమైన రాజశేఖర్‌రెడ్డిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. శనివారం బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బాలికను ఇంట్లో పనిలో పెట్టుకోవడమే తప్పు అన్నారు. అంతటితో ఆగకుండా దొంగతనం గద్వాలలో జరిగితే మల్దకల్‌లో ఫిర్యాదు చేయడం పై ఆయన అనుమానం వ్యక్తం చేశారు. రెండు నెలల క్రితం దొంగతం జరిగితే ఈనెల 11వ తేదీన ఎలా ఫిర్యాదు చేస్తాడని, ఇందులో అనేక అనుమానాలు ఉన్నాయని పోలీసులు సమగ్రంగా విచారణ చేయాలని డిమాండ్ చేశారు. బాలికను పనిలో పెట్టుకున్నందుకు, మృతికి కారణమైనందుకు పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలన్నారు. సీడ్ అర్గనైజర్ తన పలుకుబడితో పోలీసుల నుంచి తప్పించుకున్నాడని, ఈ విషయం ప్రజల్లో చర్చకు రాకముందే ఆయనను అరెస్టు చేయాలని లేదంటే పోలీసులు అపవాదుమోయాల్సి వస్తుందన్నారు. సమావేశంలో అసెంబ్లీ కన్వీనర్ రామాంజనేయులు, ఉపాధ్యక్షుడు రజక నర్సింహులు, నాయకులు దేవదాసు, అనిల్, ఢిల్లీవాల కృష్ణ, ఆసీఫ్, మోహన్‌రెడ్డి, రజక నరసింహ ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గద్వాల అర్బన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ధరూరు సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ స్తంభాల మార్పు, ఏబీ స్విచ్ మార్చుతున్నందున ఆదివారం ఉదయం 11 నుంచి మూడు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏడీఈ రమేష్‌బాబు, ధరూరు ఏఈ అనీల్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ధరూరు మండల కేంద్రం, జాంపల్లి, జూరెడ్డిపల్లి, దోర్నాల గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు సహకరించాలని కోరారు.

అర్ధరాత్రి రోడ్లపై తిరిగితే కేసులు నమోదు చేస్తాం

గద్వాల క్రైం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో అర్ధరాత్రి దాకా రోడ్లపై తిరిగే ఆకతాయిలపై కేసులు నమోదు చేస్తామని పట్టణ ఎస్ఐ కళ్యాణ్‌కుమార్ శనివారం తెలిపారు. పట్టణంలో అర్ధరాత్రి వరకు అకతాయిలు మద్యం మత్తులో తిరగడంతో గొడవలు జరుగుతున్నాయని, అర్ధరాత్రి రోడ్లపై తిరుగుతున్న యువతపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సీఎం కప్ ఏర్పాట్లు పరిశీలన

గట్టు/అలంపూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండల స్థాయిలో జరిగే సీఎం కప్ పోటీలకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం గట్టులో క్రీడా స్థలాలను ఎంపీడీవో చెన్నయ్య, ఎంఈవో నల్లారెడ్డి, పీఈటీ రేణుక పరిశీలించారు. వచ్చే నెల ఒకటి, రెండు తేదీల్లో పోటీలు జరుగుతాయని, ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 30వ తేదీ లోపు ఎంపీడీవో కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. అదే విధంగా అలంపూరు ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీవో పద్మావతి, ఎంఈవో అశోక్ కుమార్ మంగళవారం మాంటిస్సోరి పాఠశాల ఆవరణలో నిర్వహించే సీఎం క్రీడల్లో ఎంపికైన క్రీడాకారులు పాల్గొనాలని, గెలిచిన క్రీడాకారులను జిల్లా స్థాయికి ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

ఆడ పిల్లలను రక్షించుకుందాం

గద్వాల న్యూటౌన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) : ఆడ పిల్లలను రక్షించుకుందామని జిల్లా సంక్షేమాధికారి సుధారాణి అన్నారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవం బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలోని బాల సదనంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలపై వివక్షత, హింస, బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలపై విద్యార్థినులు అవగాహన కలిగి ఉండాలన్నారు. సమ సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర గొప్పదన్నారు. బాలికలు స్వయం సంవృద్ధి సాధించాలని, గతంలో ఇంటికే పరిమితమైన మహిళలు నేడు పురుషులతో సమానంగా రాణిస్తున్నారన్నారు. బాల్య వివాహాలు, ఆడపిల్లల విక్రయం చట్టరీత్యా నేరం అన్నారు. సీడబ్ల్యూసీ చైర్మన్ సహదేవుడు ఉన్నారు.

గద్వాల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు

» నాలుగు మునిసిపాలిటీలు, 194 రెవెన్యూ గ్రామాలతో జీవో జారీ

గద్వాల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : గద్వాల జిల్లా అభివృద్ధికి మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంటు జోగుళాంబ గద్వాల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేస్తూ శుక్రవారం రాత్రి జీవో జారీ చేసింది. ఇందులో జిల్లాలోని గద్వాల, అయిజ, వడ్డేపల్లి, అలంపూర్ మునిసిపాలిటీలతో పాటు 194 రెవెన్యూ గ్రామాలను చేర్చింది. దీంతో జిల్లాలోని నాలుగు మునిసిపాలిటీలు, 255 గ్రామ పంచాయతీలు ఈ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలోకి వచ్చాయి. దీన్ని ఏర్పాటు చేయడంతో ప్రధాన పట్టణాలతో పాటు మండల కేంద్రాల్లో చక్కటి ప్లానింగ్‌తో సమగ్రమైన మౌలిక వసతుల కల్పనకు వీలు అవుతుంది. అదే విధంగా గ్రామాల సుందరీకరణ, పట్టణాల విస్తరణ, రోడ్లు, నీటి సరఫరా, ఉపాధి అవకాశాలు మెరుగుపడే అవకావం ఉంది. కేంద్ర ప్రభుత్వం పట్టణాభివృద్ధికి ఇచ్చే నిధులు జిల్లాకు ఎంతగానో ఉపయోగపడుతాయి. అంతేకాకుండా పట్టణాభివృద్ధిలో ప్రవేశ పెట్టే పథకాలు, ఉపాధి అవకాశాలు జిల్లా ప్రజలకు లభించే అవకాశం ఉంది. హైదరాబాద్ లాంటి మెట్రోపాలిటిన్ పట్టణాలకే ఉన్న అర్బన్ డెవలప్‌మెంటు అథారిటీలు ఇప్పుడు జిల్లాలో కూడా అమలు చేసి, వాటి స్వరూపాలు మార్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అయితే కొన్ని జిల్లాలో అర్బన్ డెవలప్‌మెంట్ పరిధిలోని 80 శాతం నుంచి 90శాతం పరిధినే తీసుకోగా జోగుళాంబ గద్వాల జిల్లా మైదాన ప్రాంతం కావడంతో జిల్లాలోని అన్ని మునిసిపాలిటీలు, గ్రామ పంచాయతీలు అర్బన్ డెవలప్‌మెంట్ పరిధిలోకి రావడంతో రానున్న రోజుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులు, పథకాలతో జిల్లా స్వరూపం మారే అవకాశం ఉన్నది.

శ్రీశైలం ప్రాజెక్టుకు కొనసాగుతున్న వరద

గద్వాల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా, తుంగభద్ర నదులకు వరదలు తగ్గుముఖం పడుతున్నాయి. శనివారం ఆల్మట్టికి 36 వేల క్యూసెక్కుల నీరు వస్తుండగా 35 వేల క్యూసెక్కులు నారాయణపూర్‌కు విడుదల చేస్తున్నారు. నారాయణపూర్‌కు 40 వేల క్యూసెక్కులు వస్తుండగా 35 వేల క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. జూరాలకు 76 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 7 గేట్లను ఎత్తి 28 వేల క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 36,887 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. తుంగభద్ర కు 19 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 8 వేల క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టుకు 1.04 లక్షల క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉండగా విద్యుత్ ఉత్పత్తి ద్వారా 67 వేల క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 885 ఫీట్లు కాగా 884.80 ఫీట్ల సామర్థ్యంలో నీటి నిల్వ చేశారు.

ట్రైనీ అధికారుల పర్యటన

అలంపూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : అలంపూరు మునిసిపాలిటీ కేంద్రంలో శనివారం రెండో రోజు ట్రైనీ సివిల్ సర్వీసెస్ అధికారులు పర్యటించారు. ఈ సందర్భంగా మునిసిపల్ చైర్ పర్సన్ మనోరమ, సిబ్బందితో కలిసి మునిసిపల్ కార్యాలయంలో అలంపూరు అభివృద్ధిపై చర్చించారు. రోడ్డు విస్తరణ పనులు, అక్షర్ పేటకాలనీ సీసీ రోడ్లు, ప్రసాద్ స్కీం పనులను పరిశీలించారు. హరిజనవాడ పాఠశాల మరియు బాలికల ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం, విద్యార్థుల హాజరును పరిశీలించి, గుందిమళ్ల పుష్కర ఘాట్‌ను సందర్శించారు. కార్యక్రమంలో కమిషనర్ సరస్వతి పాల్గొన్నారు.



హరిజనవాడ పాఠశాలను పరిశీలిస్తున్న ట్రైనీ సివిల్ సర్వీస్ అధికారులు

క్రాస్‌కంట్రీ పోటీలకు గద్వాల విద్యార్థులు

గద్వాల టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : కర్ణాటకలోని మంగళూరు విశ్వవిద్యాలయంలో త్వరలో నిర్వహించనున్న జాతీయ స్థాయి క్రాస్ కంట్రీ పది కిలో మీటర్ల పరుగు పందెం పోటీలకు స్థానిక మహారాణి ఆదిలక్ష్మి దేవమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. పాలమూరు విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన సౌత్ జోన్ - అంతరాష్ట్ర విశ్వవిద్యాలయాల పోటీల్లో ప్రతిభచాటిన ఎస్.అశోక్, బి.హరికృష్ణ, ఎం.జయలక్ష్మి విద్యార్థులు ఎంపిక కావడంతో శనివారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ కలందర్ బాషా, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కే.చంద్రమోహన్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ కరుణాకర్, అధ్యాపకులు అభినందించారు.

అక్రమ బ్లాస్టింగ్‌ను అడ్డుకోవాలి

గద్వాల టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : భారత్‌మాల హైవే నిర్మాణం పేరుతో జిల్లాలో యథేచ్ఛగా జరుగుతున్న అక్రమ బ్లాస్టింగ్‌లను వెంటనే నియంత్రించాలని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. బ్లాస్టింగ్ వల్ల రెండు రోజుల క్రితం గట్టు మండలం సల్కాపురం గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు గాయాలపాలై పట్టణంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా శనివారం బాధితులను పోరాట సమితి నాయకులు పరామర్శించి, మాట్లాడారు. అక్రమ బ్లాస్టింగ్ వల్ల గతంలో ఒక వ్యక్తి చనిపోగా, బ్లాస్టింగ్ జరుగుతున్న చుట్టు పక్క గ్రామాల్లో ఇళ్లు బీటలు వారుతున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నా అధికారులు స్పందించకపోవడం బాధ్యతారాహిత్యమన్నారు. త్వరలోనే బాధిత గ్రామాలను సందర్శించి అక్కడి వాస్తవ పరిస్థితులను తెలుసుకుంటుందన్నారు. పోరాట సమితి నాయకులు బుచ్చిబాబు, శ్రీనివాస్ యాదవ్, రంగస్వామి, నాగరాజు ఉన్నారు.

అనుకూలంగా లేదంటూ ఆందోళన

అయిజ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : అయిజ కూరగాయల మార్కెట్ వ్యవహారం గందరగోళానికి గురిచేసింది. అది కాస్త ఆందోళన వరకు తీసుకెళ్లింది. వివరాల్లోకి వెళ్తే.. అయిజలో తిక్క వీరేశ్వరస్వామి కూరగాయల మార్కెట్ నిర్వహణ ప్రత్యేకంగా సాగుతోంది. కొత్త బస్టాండు సమీపంలో ప్రత్యేక దుకాణాలను ప్రైవేట్ వ్యక్తులు నిర్మించుకుని కూరగాయలకు వేలం పాట, అమ్మకాలు అక్కడే సాగించేవారు. కానీ శనివారం ఉదయం మునిసిపల్ చైర్మన్ దేవన్న వ్యవసాయ మార్కెట్ నందు కాకుండా చిరు వ్యాపారుల కోసం నిర్మించి వ్యాపార సముదాయలలోనే కూరగాయల మార్కెట్ నిర్వహణ, వేలం పాట నిర్వహించాలని కోరారు. వ్యవసాయ మార్కెట్‌కు వెళ్లి అక్కడికి వచ్చే కూరగాయల వాహనాలను తరలించే ప్రయత్నం చేశారు. మీ కోసం నిర్మించిన స్థలంలోనే వ్యాపారాలు కొనసాగించాలని తెలిపారు. అక్కడ స్థలం అనుకూలంగా లేదు మేము రామని తేల్చి చెప్పారు. ఈ క్రమంలో ఒక దశలో రైతులు, మునిసిపల్ స్పిందికి వాగ్వివాదం జరిగింది. దీనితో రైతులు పాత బస్టాండు ముందు గద్వాల రహదారిపై అడ్డంగా కూర్చుని నిరసన తెలిపారు. పోలీసు అధికారులు వచ్చి సర్ది చెప్పటంతో సమస్య సద్దుమణిగింది.

ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలి



అయిజలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

అయిజ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు అందడం లేదని అయిజలో శనివారం కళాశాలల విద్యార్థులు ఏబీవీపీ విద్యార్థులతో కలిసి నిరసన చేపట్టారు. ప్రభుత్వాలు మారినా తమకు న్యాయం చేయటం లేదని వాపోయారు. చదువు పూర్తయిన అర్హత సర్టిఫికెట్‌లు కళాశాల యజమాన్యం అందజేయడం లేదని, దీంతో ఉద్యోగ పరీక్షలకు, ఉన్నత చదువులకు దూరంగా ఉన్నామన్నారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అయిజ కొత్త బస్టాండు ముందు బైఠాయించి నిరసన తెలిపారు. అక్కడ నుంచి ర్యాలీగా తెలంగాణ చౌరస్తా మీదుగా వెళ్లి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు విద్యార్థి ఎంపిక

కేటిదొడ్డి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాతపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి మధు రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 28, 29, 30 తేదీల్లో పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో జరిగే అండర్-17 బాలుర వాలీవాల్ స్టేట్‌మీట్‌లో పాల్గొననున్నట్లు హెచ్ఎం చంద్రసేనారెడ్డి తెలిపారు. శనివారం పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థిని ఫిజికల్ డైరెక్టర్ మోహన్ మురళి, ఉపాధ్యాయులు అభినందించారు.

మాలల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలి

గద్వాల టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఆదివారం మాలలు తలపెట్టిన ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ కోరారు. 'హలో మాల.. చలో నాగర్‌కర్నూల్' పేరుతో నిర్వహిస్తున్న పోస్టర్లను పట్టణంలోని దళిత ఐక్యవేదిక కార్యాలయం వద్ద శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ మాలలు ప్రతీ ఒక్కరు తమకు జరుగుతున్న అన్యాయాన్ని ఎదురిస్తూ ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ అమలును నిలిపివేసే వరకు రాజీలేని పోరాటం సాగించేందుకు మాల మహానాడు సిద్ధంగా ఉందన్నారు. మాల మహానాడు నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు చింత సతీష్, ఉపాధ్యక్షుడు కృష్ణయ్య, డాక్టర్ చెన్నయ్య, ప్రిన్సిపాల్ కృష్ణయ్య, గోవిందరాజులు, నరసింహులు, ఆంజనేయులు, బుచ్చన్న, కృష్ణ ఉన్నారు.